# నయనతార

ఇంటర్వెల్లో లైట్లు గభాల్న వెలిగాయి. అంతవరకు సినిమాలో లీనమయిన సారథి కళ్ళు చికిలించి ప్రక్కకి తిరిగాడు. సినిమా మొదలుపెట్టిన పదిహేను నిమిషాలకి ఎవరో స్త్రీ వచ్చి తన ప్రక్కన కూర్చోవడం గమనించి సారథి మరో వైపు వదిగి వదిగి కూర్చున్నాడు అంతసేపూ. కళ్ళు కాంతికి అలవాటుపడ్డాక ఆ స్త్రీ తననే పట్టి పట్టి చూస్తూండడం గమనించి కాస్త తత్తరపడ్డాడు. చూపులు మరల్చుకున్నాడు బిడియంగా. రుమాలుతో మొహం తుడుచుకుంటూ రుమాలు చాటుగా మరోసారి అటు చూసాడు. ఆమె ఇంకా అలాగే చూస్తూంది. ఛా ... ఏమిటలా అసహ్యంగా తనని చూస్తూంది!...ఆ కళ్ళు నవ్వుతున్నాయి... ఆ కళ్ళు - ఆ నవ్వు ... పరిచితమైనవిగా కనిపించాయి ఓ క్షణం! ... మరోసారి తల తిప్పేసరికి ఈసారి ఆమె పెదాల మీద సన్నని నవ్వు మెదిలింది. ఎందుకలా తనని చూస్తూంది ! ఎందుకలా నవ్వుతూంది ! ... కొంపదీసి ...

ఆలోచన తెగకముందే తనముందు వరసలో కూర్చున్న స్టూడెంట్లు కొందరు వెనక్కి తిరిగిచూసి 'తారా ... నయనతార! హుర్రే నయనతారా!' అంటూ నిల్చుని కేకలు పెట్టారు. అందరూ చటుక్కున తలలుతిప్పి

చూశారు ... ఈలలువేశారు కొందరు ... బాల్కనీలో గలభాకి క్రింది తరగతుల వారందరూ లేచినిలబడి ఆరాటంగా చూశారు ... 'నయనతారా!' ... అంటూ ఉత్సాహంగా కేకలు వేశారు. చప్పట్లుకొట్టారు. బెంచీలమీద దరువులు చరిచారు "నయనతార నిలబడాలి మాకు కనిపించాలి. మా అభిమానతారని మేం చూడాలి" అంటూ కేకలు పెట్టారు. ఈలలు, చప్పట్లు, కేకలతో హాలంతా దద్దరిల్లింది. మేనేజరు పరిగెత్తుకు వచ్చాడు. గేటుకీపర్లు జనాన్ని కూర్చోమంటున్నారు. మేనేజరు సారథి ప్రక్కన కూర్చున్న ఆమె దగ్గరికివచ్చి వినయంగా నమస్కారం చేశాడు. "తమరొక్కసారి నిలబడి అందరికీ కనపడండి ... లేకపోతే వూరుకునేట్టులేరు జనం... బెంచీలు, కుర్చీలు విరగ్గొట్టేస్తున్నారు..." అన్నాడు. ఆమె అంతవరకు చిరునవ్వుతో అదంతా గమనిస్తూంది. మేనేజరు చెప్పాక అలాగేనన్నట్టు తలాడించింది. నవ్వి లేచినిలబడి ప్రేక్షకులందరిని ఉద్దేశిస్తూ నమస్కారం చేసింది, నాలుగువైపులా తిరిగి. అందరూ మరోసారి యీలలు వేశారు. చప్పట్లు కొట్టారు. అప్పటికి తృప్తి అయినట్లు కూర్చోడం ఆరంభించారు. మేనేజరు ఇంక ఆలస్యం చేయకుండా లైట్లార్పించి పిక్చరు ఆరంభం చేశాడు. అంతా సద్దుమణిగింది.

నయనతార ...! అంటే తన అభిమాన హీరోయిన్ ... యిప్పుడు చూస్తున్న సినిమాలో అద్భుతంగా నటిస్తున్న నాయిక ... తన ప్రక్కన కూర్చున్న ఆమె సినీతార. ప్రఖ్యాతతార అందులో తన అభిమాన నటి. అబ్బ,

యీామే నయనతార. ఇలా వుం దేమిటి ? ఇంత నలుపా, సినిమాలో అంత అందంగా కనిపించే నయనతార. ఈమే ?! ఆమె శరీరంలో కళ్ళు, పళ్ళు మాత్రమే తెల్లగా వున్న భాగం! గ్లామరస్ తారగా, అభిమాన నటిగా ప్రేక్షకులు ఆరాధించే నయనతార ఈవిడా...

ఆనందం, ఆశ్చర్యం, గాభరా ఏవేవో భావాలు ముప్పిరిగొంటూాంటే తలతిప్పి ఆమెవైపు చూశాడు సారథి. ఆ చీకట్లోకూడా ఆమె కళ్ళు తననే చూస్తున్నట్లు గుర్తించాడు సారథి.

ఆమె కళ్ళు మెరుస్తున్నాయి. ఆ కళ్ళు నవ్వుతున్నాయి ... ఆ కళ్ళు ఎక్కడ చూశానా అన్న అతని సందేహానికి యిప్పటికి సమాధానం దొరికింది సారథికి. ఎన్ని సినిమాలలో ఆ కళ్ళని చూశాడు. ఆ నవ్వే కళ్ళు అతని అభిమాన నటి ఆ కళ్ళు అతనికి చాలా యిష్టం. ఆ కళ్ళు - కళ్ళనీళ్ళు కార్చకుండానే హాలుహాలంతటిని కన్నీళ్ళు కార్పించడం తనకి తెలుసు. అందుకే ఆ కళ్ళంటే అతనికి యిష్టం. ఆమె అందం అంతా కళ్ళే; అన్నసంగతి మనిషిని చూశాక మరింత స్పష్టంగా బోధపడింది. కాని ... కాని తననిచూసి ఎందుకలా నవ్వుతూంది.

కళ్ళు తెరవైపు చూస్తున్న సినిమామీాద మనసు లగ్నం చెయ్యలేకపోతున్నాడు సారథి. తనప్రక్కన ప్రఖ్యాత నటీమణి కూర్చుందన్న ఆలోచనతో అతను స్థిరంగా కూర్చోలేకపోతున్నాడు. అన్నిటికంటె ఆమె తనని పట్టి పట్టి ఎందుకలా చూస్తుందోనని గాభరాపడుతున్నాడు.

చెమటలు పడుతున్నాయి. పెద్ద సినీతార, తన అభిమాన నటి ప్రక్కనుంది — ఈ సదవకాశాన్ని వినియోగించుకుని రెండు మాటలు—ఆమె అంటే అతనికెంత అభిమానమో, తన అభిమాన నటి ఆమేనని చెప్పాలనిపించినా నోరు సహకరించలేదు. అతని అవస్థ గమనిస్తూ నయనతార నవ్వుకుంది. ఇంకా అతన్ని ఇబ్బంది పెట్టకూడదన్నట్టు ...అతని ముంజేతిని అంటీ అంటనట్టు తాకి "నన్నింకా గుర్తుపట్టలేదా ?" అంది.

సారధి వులిక్కిపడ్డాడు. వళ్ళు ఝల్లుమంది. బిత్తర పోతూ చూశాడు.

"మీరు ... మీరు తెలియకపోవడం ఏమిటి ? ... ప్రసిద్ధ సినీనటి నయనతారగాదూ ?" అన్నాడు నోరు పెగుల్చుకొని కాసేపటికి.

"అదిసరే ... నన్నింకా గుర్తించలేదన్నమాట ... యీ సుందరి జ్ఞాపకం లేదన్నమాట" నెమ్మదిగా అంది.

సుందరి ! ... సుందరి...! "సుందరివా నీవు?" చటుక్కున గుర్తువచ్చి సంతోషంగా అరిచినంత పనిచేశాడు సారధి.

"ష్, నెమ్మది ... పోనీ, యిప్పటికన్నా గుర్తు వచ్చాను ... వచ్చిందగ్గిరనించి చూస్తున్నాను గుర్తిస్తావేమోనని" చెవిలో గుసగుసలాడింది.

సారధి ఏదో చెప్పబోయాడు..."తరవాత మాట్లాడుకుందాం, అంతా యిటే చూస్తున్నారు ... సినిమా అయ్యాక ఇంటికెడదాం - వెళ్ళిపోకు" అంటూ తెరవైపు తిరిగి సినిమా చూడడంలో నిమగ్నమైంది తార.

సారథి యింక సినిమా చూడలేకపోయాడు. మనసు ఆరేళ్ళ వెనక్కి పరిగెత్తింది.

సుందరి !... ప్రఖ్యాత సినీతార నయనతార ! గుమస్తా కూతురు, ఏడుగురు పిల్లలమధ్య నాలుగో ఆడపిల్లగా రెండొందల జీతంమధ్య దరిద్రంలో పెరిగిన సుందరి యీనాడు లక్షల కధికారిణి ? నల్లటి నలుపువల్ల పెళ్ళికి నోచుకోని సుందరి అందాన్ని యీనాడు లక్షలమంది ఆరాధిస్తున్నారా ? సుందరిట, సుందరి అంటూ హేళనగా నవ్వే అందరూ - యీనాడు ఆ సుందరి గ్లామరస్ తార, అందాల తార అంటూ పొగుడుతుండే నయనతార — ఆ సుందరా!

తండ్రి పెళ్ళి చెయ్యలేక మూడో పెళ్ళి ముసలి మొగుడిని నిర్ణయిస్తే యింట్లో ఏడ్చి మొత్తుకొని చస్తానని బెదిరించినా పెళ్ళికి తప్పించుకోలేని సుందరి - తెల్లారితే పెళ్ళనగా అర్ధరాత్రి తన గది దగ్గరికి వచ్చి తనని పెళ్ళి చేసుకోమని కన్నీళ్ళతో ప్రార్థించితే, చదువే ఓ కొలిక్కిరాని తన నిస్సహాయత, చండశాసనుడైన తండ్రిని ఎదిరించలేని పిరికితనమే గాక చూస్తూ చూస్తూ ఓ లేనింటి నల్లపిల్లని పెళ్ళాడగలిగే సంస్కారం, సహృదయత లోపించిన తనని, తన పిరికితనాన్ని, తన మౌనాన్ని ఓ తిరస్కారపు చూపు విసిరి విసవిస వెళ్ళిపోయి, తెల్లారేసరికి యింటిలోంచి మాయమయిన ఆ సుందరి ... యీనాడు ఆరేళ్ళతర్వాత ప్రఖ్యాత సినీతారగా తేలిందా ? మింగుడుపడని ఆ నిజాన్ని మింగలేకపోతున్నాడు సారథి.

తల తిప్పి చూసాడు. తార తన్మయతతో తనని తాను తెరమీాద చూసుకుంటుంది నల్లటి సుందరి. సినిమాలో అంత అందంగా కనిపించే సుందరిని అందుకే యిన్నాళ్ళూ గు_ర్తించలేకపోయాడు. మేకప్‌కి, ఫొటోగ్రఫీకి మనిషిని యింతగా మా ర్చేశ_క్తి వుందని అతనికేం తెలుసు. ఆ మొహం తెరమీాద చూసుంటే ఎక్కడో చూసినట్టు అని పించినా సుందరే అనుకోలేకపోయాడు. ఇందాక సుందరిని చూసిందగ్గరనించి ఆ కళ్ళు ఆ నవ్వు ఎక్కడో ఎప్పుడో ఎరిగినట్లనిపించింది.

సుందరి ఇదివరకుకంటె వళ్ళుచేసింది. డబ్బు తెచ్చి పెట్టే ఆరోగ్యంతో మిసమిసలాడుతూ, కా_స్త నలుపు విరిగి నట్లనిపించింది. లేత ఆకుపచ్చ షిఫాన్ చీరమీాద గులాబీల ప్రింటువున్న చీర, కొద్దిపాటి మేకప్, అందంగా ఫేషన్‌గా చుట్టిన ముడితోవున్న నయనతారకి - వెలిసిపోయిన పాత వాయిల్ చీర, మెడమీాద జిడ్డోడుతున్న జాకట్టు, గట్టిగా బిగించివేసిన జడ, జిడ్డు మొహం, అసలే నలుపు మొహం మీాద, ఆ పెద్ద పెద్ద కళ్ళకి పాముకున్న నల్లటి కాటుక, ఇంటిలో చాకిరి, పోషణలేక, మనసులో దిగుళ్ళతో, ఎండి పోయినట్లుండే ఆ సుందరికీ ఎంత వ్యత్యాసం. ఆహా. డబ్బు మహత్యం ! అనుకున్నాడు సారథి.

సుందరిలాంటి అనాకారి, అనామిక యింత ప్రసిద్ధ నటి ఎలా కాగలిగింది. ఏప ఇబ్బందులు పడింది? ఏప ముళ్ళ కంచెల్ని దాటగలిగింది? ఏప త్యాగాలు చేసింది ?

పిక్చరు ఎప్పుడయిందో, జాతీయగీతం వినిపిస్తోంటే ఆలోచనలనించి లేచి నిల్చున్నాడు సారథి. లైట్లు వెలిగాయి. "రా, వెడదాం," అంది తార సారథి వంక తిరిగి.

"మీతో రమ్మంటారా ?..."

"ఏం, ఏమన్న పనుందా ?"

"అబ్బె లేదు, రాత్రి అయిందిగా, రేపో ఎప్పుడో వస్తా"

"రాత్రి అయితేనేం. నేను డ్రాప్ చేస్తా మళ్ళీ. ఇంటికెళ్ళి మాట్లాడుకుందాం. ఇన్నాళ్ళయింది కలుసుకున్నాం."

క్రింద బెంచీలెక్కి తమ అభిమాన తారని మరోసారి చూడాలని ఆరాటపడిపోతున్నారు జనం. నయినతారనే చూస్తూ జనం అంతా నిల్చున్నారు. కొంతమంది స్టూడెంట్లు నయునతారని చుట్టుముట్టారు. మేనేజరు దారి చూపిస్తూండగా గుంపుని తప్పించుకుంటూ క్రిందకి వెళ్ళింది. క్రింద, అందరూ వెళ్ళిపోకుండా తమ అభిమాన నటిని మరోసారి దగ్గిరనించి చూడాలన్న ఆరాటంతో నిలబడ్డారు. బయట పోలీసులు గుంపుని అదిలిస్తూంటే అందరికి చిరునవ్వుతో నమస్కారం చేస్తూ కారులో కూర్చుంది తార. ఆమె వెంట కారెక్కి ఆమెతో వెనకసీటులో కూర్చున్న సారథిని అంతా అదృష్టవంతుడన్నట్లు అసూయగా చూశారు. పెద్ద కారు పాములా మెత్తగా కదిలింది.

"ఊ, ఏమిటి ఇంకా ఆశ్చర్యంగా వుందేమిటి, నేను సుందరినా అని ఇంకా నమ్మబుద్ధి కావడంలేదా ఏమిటి" అంది తార.

"నిజంగానే నమ్మలేకపోతున్నాను, ఎక్కడి సుందరి- ఎక్కడి మీరు."

"మీరు, అంటూ కొత్తగా మాట్లాడుతున్నావేమిటి, నేను అందరికి నయనతారని కాని నీకు పాత సుందరినే." చనువుగా అంది సుందరి.

ఆ మాటకి చాలా ఆనందం కల్గింది సారథికి. ఆనం దంగా, "నిజంగా ఇప్పటికీ నమ్మలేకపోతున్నాను సుందరీ. ఎన్ని సినిమాలలో చూశానుగాని నీవన్న అనుమానమే రాలేదు సుమా. అవును సరాసరి తారాపథంకి ఎలా వెళ్లి పోయావు!" కుతూహలంగా అడిగాడు.

నయనతార కారుసీటుకి జారగిలపడి అదోలా నిట్టూ రుస్తూ "సరాసరి వెళ్ళానా? లేదు. త్రోవలో ఎన్నో నిచ్చెనలు, పాములు దాటుకుంటు వెళ్ళి చేరాను, పరమపద సోపాన పటంలో మాదిరి. ఈనాడు ఈ స్థానంలో వుండ డానికి ముందు నేనేం కష్టాలుపడ్డానో, ఏ ఇక్కట్లుదాటానో అదంతా పెద్ద కథలే. సరే మరిచిపోయిన కష్టాలని యిప్పు డెందుకు గుర్తుతెచ్చుకోవటం. అది సరే నీ గురించి చెప్పు. ఇప్పుడేం చేస్తున్నావు, ఏం ఉద్యోగం, పెళ్ళయిందా, పిల్లలా."

"ఉండుండు, అన్ని ప్రశ్నలూ ఒకసారేనా. ఇక్కడ ఓ కంపెనీలో ఎకౌంటెంట్ గా ఉంటున్నాను. పెళ్ళిగాలేదు గనక పిల్లల ప్రసక్తిలేదు." నవ్వాడు సారథి.

"పెళ్ళి కాలేదూ! ఇంకా చేసుకోలేదూ." తార గొంతులో ఆశ్చర్యంతో పాటు అదోరకం ఆనందంలాంటిది ధ్వనించింది.

"లేదు, ఏదీ ఉద్యోగంలో చేరి మూడేళ్ళయింది. నాలుగు డబ్బులు వెనకేసుకోకుండా ఇప్పటినుంచి చేసుకుని ఏం సుఖపడాలి. అది సరే. మరి నీ సంగతి."

"ఏమిటా సిల్లీ ప్రశ్నలు ? ప్రఖ్యాత సినీతార నయన తార పెళ్ళయితే నీలాంటి వాళ్ళకి తెలియ చెప్పవా పత్రికలు." నవ్వుతూ అంది తార.

నిజమే ! అనుకున్నాడు సారథి మాటలలో కారు ఏఏ రోడ్డులు తిరిగి ఇల్లు చేరిందో కూడా గుర్తించలేదు సారథి. గేటు దగ్గిర కారాగాక అప్పుడు చూశాడు. గూర్ఖా సలాం చేసి గేటు తెరిచాడు. కారు రంయ్‌మని దూసుకుని వెళ్ళి పోర్టికోలో ఆగింది. బంగళా అంతా కాంతులీనుతోంది. కారాగడంతోటే లోపల్నించి నాలుగు బొచ్చుకుక్కలు తోకాడించుకుంటూ వచ్చి తారమీాదికి ఎగబాకాయి. "హల్లో రీటా, జానీ, టైగర్, పుస్సీ." అంటూ మీాద పడుతున్న కుక్కలన్నింటినీ దగ్గిరకి తీసుకుని దువ్వింది "నా.... గో.. ఐ సే."అంది తార వాటితో.అవన్నీ బుద్ధిగా తార దగ్గిర నించి తోకాడించుకుంటూ వెళ్ళిపోయాయి.బంగళానిచుట్టుతూ గుండ్రటి వరండా వుంది. నున్నటి స్తంభాలు, పూలకుండీలు, క్రీపర్లు, వరండాలో రెండు పేము కుర్చీల సెట్లు. అన్నీ చూస్తున్న సారథిని "రా. లోపలికి." అంటూ దారితీసింది

తార. అడుగు పెడుతూండగానే ముందు పెద్దహాలు వుంది. హాలులో ఓ పక్క మేడమీదికి వెళ్ళడానికి అందమైన కర్ర మేడ మెట్లు వున్నాయి.

హాలులో ఖరీదయిన కార్పెట్లు, ఖరీదయిన ఫర్నిచర్, సిల్కు పరదాలు, అందమైన చాండిలియర్స్ డెకరేషన్ పీసెస్, పెయింటింగ్స్, రేడియోగ్రాము. ఒకటేమిటి డబ్బుతో ఎంత అందమైన వస్తువులు కొనవచ్చునో అన్నీ వున్నాయి. అన్నీ ఉండడం కన్న వాటిని అందంగా అభిరుచితో అలంకరించిన నైపుణ్యమూ కనిపిస్తుంది ప్రతిఅంగుళంలో. జిడ్డోడుతున్న రెండు గుడ్డ కుర్చీలమధ్య చింకిచాపల మధ్య పెరిగిన సుందరికి యీనాడు యీ టేస్టు ఎక్కడనించి వచ్చింది? డబ్బు మహాత్యం. మరోసారి అనుకున్నాడు సారథి.

హాలునిండా ఆడ మగ పిల్ల పెద్ద చాలామందిఉన్నారు. ఆరుగురు ఆడ మగ కలిసి పేకాడుకుంటున్నారు. ఇద్దరు వయసు మళ్ళిన వాళ్ళు చదరంగం ఆడుతున్నారు. కొందరమ్మాయిలు రేడియోగ్రాం చుట్టూ కూర్చుని రికార్డులు వింటున్నారు. కొందరు సోఫాల్లో వ్రాలి పుస్తకాలు చదువుతున్నారు.

హాలులో అడుగు పెట్టగానే ఒక్క క్షణంలో సారథి కంటపడిన దృశ్యాలివి. తారలోపలికి రావడంతో హాలంతా ఒక్కక్షణం నిశ్శబ్దమయింది. అందరూ తలలు ఒకసారి పైకెత్తి తారవైపు చూశారు. మరుక్షణంలో మళ్ళీ ఎవరి పనులలో వాళ్ళు నిమగ్నులై పోయారు. చదరంగం ఆడుతున్న ఇద్దరిలో సుందరి తండ్రినిగుర్తించి పలకరించబోయేం

తలో తార "రా పైకి వెడదాం" అంటూ మెట్లమీాదకి దారి తీసింది. సుందరి తండ్రి సారథిని గుర్తించలేదేమో ఏమీా పలకరించలేదు.

మేడ మెట్లు ఎక్కుతూ ఇంకా అందరిని ఆశ్చర్యంగా చూస్తున్న సారథిని చూసి "వీళ్ళంతా నా బంధుజనం. నా హితైషులు, శ్రేయోభిలాషులు." అంది చిన్నగా, చిలిపిగా నవ్వి.

మేడమీాదకి అడుగు పెట్టాక అదో వేరే లోకంలో వున్నట్టనిపించింది సారథికి. మేడమీాద అందమైన పెద్దగదులు రెండు వున్నాయి. "మేడ అంతా నేనే వాడుకుంటాను. క్రిందగదులలో అంతావుంటారు. ఇక్కడ ఈగది డ్రాయింగు రూముగా, ఇలా రా ఇదిగో ఇది నా బెడ్ రూము" అంటూ తీసికెళ్ళి చూపించింది సారథికి. క్రింద డ్రాయింగు రూము కంటె ఇంకా ఖరీదయిన అందమైన ఫర్నీచర్ వుంది మేడ మీాద. అక్కడికంటె ఖరీదయిన పరదాలు, తివాచీలు, ఒక టేమిటి- బెడ్ రూమ్... అదేదో దేవలోకంలాగ.. చల్లగా డిమ్ లైటు కాంతిలో, దేవలోకంలో అప్సరసలు పడుకునే లాంటి మంచం, గులాబీరంగు పట్టుపరుపు-సిల్కు దుప్పట్లు, గులాబీరంగు పల్చటి సిల్కు పరదాలు, విరిసిన గులాబీ పూలతో వాజులు .. గులాబీరంగు ఫర్నిచరు, గులాబీరంగు కార్పెట్లు, సన్నని గులాబీ లవండర్ పరిమళం... ఏదో గులాబీ తోటలో అడుగుపెట్టినట్టుంది. విభ్రాంతితో కళ్ళు వాల్చడం మరిచిపోయి చూస్తున్నాడు.

"బట్టలు మార్చుకు వస్తాను. ప్లీజ్, అలా డ్రాయింగు రూములో కూర్చో ఒక్క క్షణం..." అన్న తార మాటలకి ఉలిక్కిపడి, సిగ్గుపడి అక్కడనించి వెళ్లి డ్రాయింగు రూములో కూర్చున్నాడు సారధి.

తననిచూసి సిగ్గుపడి వీధిలోంచి ఒక్కగెంతు గెంతి లోపలికి దుమికే సుందరి, తననే చూస్తున్నట్టు అనుకుని తను కనిపించేసరికి సిగ్గుసిగ్గుగా నవ్వి పమిట కప్పేసుకుంటూ, మెలికలు తిరిగి తలుపుచాటుకివెళ్ళి తొంగి తొంగిచూసే సుందరి, ఏమన్నా పుస్తకాలుంటే ఇమ్మంది అక్క అంటూ తమ్ముడ్ని తన దగ్గరకి పంపి వీధిగుమ్మంలో నిల్చుని ఆరాటంగా తన గది కిటికీవైపు చూస్తూ నిల్చునే సుందరి, సుందరి తండ్రి ఎప్పుడన్నా పిలిస్తే వీధిగుమ్మంలో కూర్చుని మాట్లాడే తన ప్రతిమాట తలుపుచాటునించే వినే సుందరి, నల్లటిమడ్డి కాఫీ ఆప్యాయంగా తమ్ముడిచేత పంపే సుందరిని... ఆమెకి తన పట్లవుండే ఆసక్తికి, ఆమె తనని ఆకర్షించడానికి పడే తాపత్రయాలని గమనించి, ఆమె ఆరాటానికి నవ్వుకునేవాడు. ఏమగాడు సుందరిలాంటి అమ్మాయిలని చూడడానికి ఆరాటపడడన్న సంగతి కూడా గుర్తించలేని ఆమె అమాయకత్వానికి జాలిపడేవాడు. అలాంటి సుందరి ఎంత చనువుగా పెద్ద పరచయస్థురాలిగా గలగల జంకుగొంకు లేకుండా ధాటిగా 'నీవు' అంటూకూడా మాట్లాడేస్తుంది. పుట్టుకనించీ ఇంత వైభవం మధ్య పెరిగినంత సహజంగా ఎంతో హుందాగా ప్రవర్తిస్తూంది.

ఫస్టుఫారం ప్యాసయి తన దగ్గర ఇంగ్లీషు సినిమా పత్రికలు తీసుకుని ఉత్సాహంగా కూడబలుక్కుంటూ తారల పేర్లు చదివే సుందరి తార అయి గలగల ఇంగ్లీషు మాట్లాడేస్తూంది.

పావలా పత్రికలు చదవడానికి నోచుకోని సుందరి బీరువాలనిండా అందమైన ఖరీదయిన ఇంగ్లీషు పుస్తకాలు! ఆనాడు సుందరిని చూసి జాలిపడిన తనని యీనాడు-పిచ్చి వెధవలా ఎలా తెల్లపోయి చూస్తున్నాడని సుందరి జాలి పడుతూంది కాబోలు. సారధికి నవ్వు వచ్చింది.

“ఏమిటలా నీకునువ్వే నవ్వేసుకుంటున్నావు. ఆ జోక్ ఏమిటో నాకూ చెప్పకూడదూ...” అంటున్న తార మాటలకి తలెత్తి అటు చూశాడు సారధి.

పల్చటి నైలాన్ గులాబీ నైట్ గౌను తొడుక్కుని జుత్తు అంతా విప్పి గులాబీరంగు రిబ్బనుతో పోనీటైల్‌గా ఎత్తికట్టి మొహం కడుక్కుని ఫ్రెష్‌గా తయారయి వచ్చిన సుందరిని చూస్తూ మరోసారి కళ్లు రెప్పలు ఆర్పడం మర్చిపోయాడు.

“పిచ్చిమొద్దులా వుండే సుందరి కేమిటి ఈ అదృష్టం అనుకుని నవ్వుకుంటున్నావుగదూ” అంది తార చనువుగా వచ్చి అతని ప్రక్కన సోఫాలో కూర్చుంటూ “కాదనకు, నీ మొహమే చెప్తుంది నీ ఆలోచన”

“కాదనను. ఇప్పుడు నేను నీకు పిచ్చిమొద్దులా కనిపిస్తున్నా కాబోలు అనుకుంటూంటే నవ్వువచ్చింది” సారధి ఆక్వర్డ్‌గా నవ్వుతూ అన్నాడు.

"ఛా. అలా ఎందుకనుకుంటాను. ఈ రోజు నాలుగు రూపాయలు సంపాదించానని అంతలో పాత సంగతులు మరచి పోయాననుకున్నావా! ఆ రోజులు అప్పటి మా కష్టాలలో ఆదుకున్న నీ సహాయం మరచి పోయానా" నొచ్చుకున్నట్టు అంది తార.

"నే నేదో సరదాకి అంటే అంత సీరియస్‌గా మాట్లాడేస్తున్నావేమిటి ?"

"రా, భోంచేద్దాం. ఆకలేస్తుంది. తరువాత మాట్లాడుకుందా" అంది తార లేచి నిలబడి.

"అబ్బే, భోజనం ఎందుకు, రూముకి వెళ్ళి చేస్తాను. క్యారియర్ వచ్చి వుంటుంది."

"అదేమిటి అన్నిటికీ అంత మొహమాట పడ్తున్నావ్ ఎవరో క్రొత్తవాడిలా. ఇదివరకు ఎన్నిసార్లు మా ఇంటిలో భోజనం చెయ్యలేదు రావోయి బాబూ, ఆకలేస్తుంది" అంటూ నడవడం ఆరంభించింది తార. సారథి ఇంకేమనకుండా వెనకాలే బయలుదేరాడు.

నిజమే, డబ్బు అవసరం వున్నప్పుడల్లా ఎదురింటిలో వుండే సారథి దగ్గర పది, పదిహేను అప్పుగా తీసుకెళ్తుండేవాడు సుందరి తండ్రి. దానికి కృతజ్ఞతగా పండగలూ, పబ్బాలు వచ్చినప్పుడల్లా భోజనానికి రమ్మని బలవంతం పెడ్తుండేవాడు. హోటలు మెతుకులతో నోరు చచ్చిపోయిన సారథికి వాళ్ళింటిలో పచ్చడి, చారు మెతుకులే అయినా ప్రాణం లేచివచ్చినట్లుండేది.

డైనింగ్ టేబిల్ దగ్గిర ఓ కుర్చీ జరిపి "రా, కూర్చో" అంది తార. తార డైనింగ్ రూములోకి రావడం చూసి

వంటవాడు కునికిపాట్లు పడుతున్నవాడల్లా లేచి నిల్చున్నాడు. "పంతులుగారు, వడ్డించండి. ఈయనకి కూడా" అంది.

నిగనిగలాడుతున్న సన్ గ్లాస్ డైనింగ్ టేబిల్, ఎనమండుగురు కూర్చోటానికి కుర్చీలు, ఫ్రిజ్, నాలుగయిదు రకాల డిన్నరుసెట్లు, టీ సెట్లతో గాజు బీరువాలు, కప్ బోర్డులు అన్నీ చక్కగా అమర్చి వున్నాయి. భోజనం వడ్డించాడు వంటవాడు. తార ఏవేవో మాట్లాడుతూంది అన్నింటికీ పరధ్యానంగానే జవాబు చెప్తున్నాడు సారథి.

సుందరి... సుందరిని ఆమె కోరినప్పుడు తను పెళ్ళాడివుంటే... అన్న ఆలోచన తొంగిచూసింది. సారథికి ఎందుకో ఆ ఊహ వచ్చిన మరుక్షణంలోనే సారథికి నవ్వువచ్చింది. తను పెళ్ళాడివుంటే సినీనటి ఎలా అయ్యేది!! మామూలుగా అందరి భార్యలలాగే పిల్లల్నికంటూ, వంట వండుతూ... ఇంటిలోంచి లేచిపోవడం మంచిపనే చేసింది. కొన్నాళ్ళు కష్టపడితే పడింది. యిప్పుడు లక్షలు ఆర్జిస్తుంది. ఈ ఇల్లు వాకిలి, ఈ సామాను అంతా చూస్తుంటే సుందరి బాగా ఆర్జిస్తున్నట్టుంది! ఎందుకార్జించదూ? రెండు మూడేళ్లుగా నయనతార లేని సినిమాలేదు. ఆమె నటించిన అన్ని చిత్రాలు బాక్సాఫీస్ హిట్స్ అవుతున్నాయి... సంపాదనకేంలోటు!

మొదటి సినిమాతోనే నయనతారకి బ్రహ్మాండమైన పేరొచ్చింది. ఆ చిత్రంలో ఆమె నటించలేదు. జీవించింది.

ఆమె పెదవి కదపకుండా, కళ్ళనీళ్ళు కార్చకుండా హాలు హాలంతటిని కన్నీళ్ళు కార్పించింది. ముసలివాడిని పెళ్ళిచేసుకుని, మూన్నాళ్ళముచ్చటగా తీరిపోయిన ఆమె సుమంగళీత్వం, తరువాత పరిస్థితుల కెదురీదలేక, కోరికలని అణుచుకోలేక ఓ యువకుడి వలలోపడి నాశనంఅయి, గత్యంతరములేక వేశ్యగా మారిన ఆమె పాత్రలో ఆమె నటించలేదు జీవించింది అని పత్రికలు, ప్రజలు పొగిడారు. ఆ పాత్రలో ఆమెని చూసి కంట తడిపెట్టనివారు లేరు. కేవలం కళ్ళతోనే ఎక్స్‌ప్రెస్ చేసి చూపించిన ఆమెకి 'నయనతార' అన్న పేరు వచ్చింది, ఆ పేరే స్థిరపడింది. ఆ చిత్రం శతదినోత్సవాలు అన్నిచోట్ల చేసుకుంది. అనేక అవార్డులు గెలుచుకుంది. మరి రెండుభాషల్లో ఆమె నాయికగా తీశారు. అంతే! నయనతార ఓవర్ నైట్ బిజీ తార అయి కూర్చుంది. కంట్రాక్ట్సమీద కంట్రాక్ట్స వచ్చిపడ్డాయి. ఆ ఏడాదిలో కనీసం ఎనిమిది చిత్రాలలో నటించింది. అన్నీ విజయవంతమయ్యాయి. అవే ఏమిటి ఇప్పటివరకు ఆమె నటించిన ఏ చిత్రమూ ఫేల్ అవలేదు. రోజురోజుకి ఆమె డిమాండ్ పెరుగుతుంది తప్ప తరగడంలేదు — ఇవన్నీ నయనతార గురించిన వివరాలు — ఏ సినిమా పత్రిక చూసినా తెలుస్తుంది కనక సారథికీ తెలిశాయి.

అయితే సుందరే నయనతార అన్న నిజం తెల్సిన దగ్గరనించి అతనింకా ఆశ్చర్యంలోంచి తేరుకోలేక పోతున్నాడు. అడుగడుగునా ఎన్నో సందేహాలు —

"వద్దు ... వద్దు ... అరే, ఇంతేసి వడ్డిస్తే ఎలా తినడం" పరధ్యానంగా వున్న సారథి - తార కూర అలా వడ్డించేస్తూంటే గాభరాగా చేయి అడ్డం పెట్టాడు.

"భోజనం చెయ్యకుండా ఏమిటా ఆలోచన... పరవాలేదు తిను ... అప్పుడు మా యింట్లో పచ్చడి మెతుకులు మాత్రం పెట్టగలిగాం ... ఇప్పుడు అన్నీ పెడ్తుంటే తినకపోతే ఎలా?.."

"అవునవును, నాకు మాత్రం యింతింత పెడ్తున్నావు. నీవు మాత్రం ఆ రెండు రొట్టెలే యిందాకటినించి తింటున్నావు. అంతేనేమిట నీ భోజనం ? అన్నింటితోపాటు భోజనానికి కూడా నాజూకు నేర్చినట్టున్నావు...!" తార రెండు రొట్టెలు ... కూర, ఒక అరటిపండు, గ్లాసుడు మజ్జిగ మాత్రం తీసుకోడం చూసి అడిగాడు సారథి.

తార అదోలా నవ్వింది. "మీరంతా అదృష్టవంతులు బాబూ, కావల్సినవి కడుపునిండా తినగలిగిన భాగ్యవంతులు ... యింత భాగ్యం వున్నా కావల్సింది హాయిగా తినగలిగే అదృష్టం నాకు లేదు ..." నిట్టూర్చింది.

"అదేమిటి ?"

"అవును ... యీ ఫిగర్ యిలా కాపాడుకోవాలంటే నోరు కట్టుకోవాలి. లేకపోతే మీలాంటి వాళ్ళందరూ తెర మీద మమ్మల్ని చూస్తారా. లావెక్కిపోతే తెర వెనక్కి పంపుతారు...అందుకోసం ... లక్షలార్జిస్తూ, నావాళ్ళందరూ తినడానికి నేను నోరు కట్టుకోవాలి. హు... లేనన్నాళ్లూ తినా

అన్నా తినలేకపోయాను. ఇప్పుడు ఉన్నా తినలేక పోతున్నాను. ఇంతకంటె ఐరనీ ఏముంది.

"నాకు స్వీట్స్ అంటే ప్రాణం. తీపి పిండివంటలంటే ఇష్టం. బిస్కట్లు, చాకలెట్లు చంటిపిల్లలా తినాలని వుంటుంది. బంగాళాదుంపల వేపుడు ప్రాణం. పప్పులో నెయ్యి వేసుకు కమ్మగా తినాలని వుంటుంది. ఇందులో ఏదీ తినలేను ఇప్పుడు. అలా అందరూ తింటుంటే తినకుండా వుండడానికి ఎంత నిగ్రహం అలవాటు చేసుకుంటున్నానో." తార పైకి నవ్వుతూ అన్నా, ఆమె మాటలలో ఆవేదనకి చలించాడు సారథి.

"గాడిదగుడ్డు. కడుపునిండా తిండికూడా లేక పోయాక యింకా సంపాదనెందుకు. ఈ లక్షలన్నీ ఏం చేసుకుంటావు. ఫిగర్ కాపాడుకోడానికి కడుపు మాడ్చు కోవాలా ?"

"మీకేం తెలుసు మా అవస్థ. డైటింగ్, ఎక్సర్ సైజులు చేస్తుంటేనే ఇలా వుండగలం. ఇంత చేస్తున్నా ఇది వరకటికంటె ఎంత వళ్ళువచ్చిందో చూశావా."

నిజమే సుందరి నిండుగా వుంది ఇప్పుడు !

"ప్చ్, మీరందరూ అనుకునేటంత, అసూయపడేంత అందమైన జీవితం కాదు మాది. ఆకాశంలో మిలమిలలాడే అందమైన తారలని దగ్గరికెళ్ళి చూస్తే వుండే గుంటలు, గతుకులు మాదిరే మా జీవితాలలోవుండే లోటు పాట్లు, నిర్వేదాలని ఊహించలేరు ఎవరూ ! ఇదివరకు డబ్బొక్కటి వుంటే చాలు, అన్ని ఆనందాలకి మూలం అనుకున్నాను ...

ఇప్పుడు డబ్బే నా అన్ని మనస్తాపాలకీ కారణం అన్పిస్తూంది. సరేలే ... అదేమిటి, ఆ పళ్ళు తీసుకో ... మరేం పరవాలేదులెద్దూ ... తిను" అంటూ అరటిపళ్ళు, ఏపిల్ పండు ముక్కలు ముందుకు జరిపింది తార.

"వద్దు బాబూ, చాలా హెవీ అయింది. ఇంక చాలు." అంటూ లేచాడు సారథి.

టవల్ అందించింది తార. తరువాత కప్ బోర్డుమీద బరిణతీసి సుగంధాలు జల్లే వక్కపొడి ఇచ్చింది.

"రా ... అలా కాసేపు గార్డెన్‌లోకి వెళ్ళి కూర్చుందాం. చల్లగా వుంటుంది."

సారథి వాచి చూసుకున్నాడు. "ఇప్పుడా, పది దాటింది. నే వెళ్ళొద్దూ."

"అబ్బ, ఇంటికెళ్ళి ఏం చేస్తావు ? పడుకోవడమేగా. ఆవిడేం లేదుగా సాధించడానికి. ఒక గంట ఆలస్యం అయితే మరేం పరవాలేదు నిద్రకి ... నే డ్రాప్ చేస్తాగా ... అసలు మనం మాట్లాడుకోనేలేదు ఇంకా."

కాదనలేకపోయాడు సారథి. పోర్టికో దాటి గార్డెను లోకి దారితీసింది తార. బంగళా ఎదురుగా చక్కటి పూల తోట అందంగా పెంచారు. వెన్నెల్లో విరిసిన రకరకాల పూలు తెల్లగా మెరుస్తున్నవి. మల్లె, జాజి, నైట్ క్వీన్, మాలతీలత అన్నిసువాసనలు కలిపి వింత పరిమళాన్ని అందిస్తున్నాయి. లైనుగా కత్తిరించిన హెడ్జింగ్ ...గార్డెనుకి మధ్యగా రాధామాధవుల విగ్రహంనించి ఫౌంటెన్ నీళ్ళు చిమ్ముతూంది రంగురంగుల బల్బులకాంతి మధ్య. చుట్టూ

సిమెంటు బెంచీలు, క్రింద పసిరిక తివాచిలాంటి లాన్, ఆ తోటలో విదేశీ, స్వదేశీ అన్నిరకాల పూలమొక్కలు రంగు రంగుల పూలతో....

"అబ్బ, ఎంత బాగుంది మీ తోట. ఈ వెన్నెల, గాలి, ఈ పూలు ఎంత అదృష్టవంతురాలివి సుందరీ, రియల్లీ ఐ ఎన్వీయూ."

"వద్దు వద్దు, అసూయపడద్దు. తరువాత జాలి పడ్తావు నా అదృష్టానికి." తార పచ్చిక మీద చేతులు వెనక్కి చాచి, కాళ్ళు సాచుకు కూర్చుంటూ నవ్వుతూ అంది.

"పోవోయ్ పోజులుమాను! లక్షలు, ఈ బంగళా, ఈ తోట అన్నీవుండి ఏదో అష్టకష్టాలు పడుతున్నట్టు పోజులు మాను"

"సర్లే నే చెప్పినా నమ్మలేవు ఇప్పుడు. కొన్నాళ్ళు పోతే నీకే అర్థం అవుతుంది"

"అవునుగాని సుందరీ. ఏమీ అనుకోకపోతే ఒక ప్రశ్న ? నీవింటిలోంచి వెళ్ళిపోయాక..."

"కథ చెప్పమంటావు ? ఎందుకులెద్దూ, అవన్నీ చెప్పడం నాకూ, వినడం నీకూ ఇద్దరికీ బాగుండదు. ఏ ఏ కష్టాలు పడ్డానో, ఏమేం పోగొట్టుకుని ఏం సంపాదించానో ఈనాడు ఇలా కూర్చుని ఎలా చెప్పగలను ?–"

"పోనీ, అన్ని వివరాలు వద్దు. కేవలం తారవి ఎలా అయ్యావో ఆ వివరం చెప్పు." కుతూహలంగా అడిగాడు సారథి.

తార లాంసులో చెంపకి చెయ్యి ఆన్చిఒరగా పడుకుంది. సారథి కొద్దిదూరంలో కూర్చున్నాడు. "ఏం చెప్పమంటావు. ఆ రోజు నీ దగ్గరికి రాత్రి వచ్చానుగదూ. నీవు నన్ను పెళ్లి చేసుకుంటానంటావేమోననే మిగిలిన చిన్నఆశ కూడా ఆరిపోయింది. ఇంకేంచేసి పెళ్ళితప్పించుకోవాలో తెలియలేదు. ఇంటిలోంచి పారిపోవాలనుకున్నాను. అందరూ కాస్తనిద్రలో పడ్డాక పెళ్ళికని వుంచిన డబ్బులోంచి అయిదు వందలు తీసుకుని ఇంటిలోంచి బయటపడి, ఏ రైలు ముందువస్తే దాన్లో ఎక్కేసాను. నాకో గమ్యంలేదు. భవిష్యత్ లేదు. రైలెక్కాక గానీ నా ముందుగతిని గూర్చి ఆలోచనరాలేదు.

"చదువుసంధ్యకూడా లేని నేను ఈ ప్రపంచంలో ఎలా బ్రతకాలో తలుచుకుంటే ఏడుపు ముంచుకువచ్చింది. నా ప్రక్కన కూర్చున్నావిడ చాలాసేపు నా ఏడుపు చూసి ఎందుకేడుస్తున్నావంటూ పలకరించింది. సానుభూతి చూపే మనిషి దొరగ్గానే మరింత ఏడుపు వచ్చింది. ఆవిడ ఓదార్చి కారణం అడిగితే ఏదీ దాచకుండా అంతా చెప్పాను. నా ముందు గతి ఏమిటని ఏడ్చాను.

"ఆవిడ జాలిపడింది. ఓదార్చింది. ధైర్యం చెప్పింది. ఆవిడ మెద్రాసు వెడుతూంది. నన్ను తనతో రమ్మంది. ఆవిడ భర్త అక్కడ సినిమాలకి ఎక్స్ట్రా సప్లయర్ట. కావలిస్తే నాకూ ఎక్స్ట్రాగా పనిప్పించగలడు అని ధైర్యం చెప్పింది.

"నాకో ఆలోచనుంటేగా? ఆవిడ చెప్పిందానికి తలాడించి ఆవిడ వెంటవెళ్ళాను. ఇంటికి తీసికెళ్ళి నా కథ చెప్పి

మొగుడికి నన్ను అప్పచెప్పింది. అప్పటినించి అతని క్రింద వుండే వందలాది ఎక్‌స్ట్రాలలో ఒకత్తెగా బ్రతికాను. ఆ మందలో నన్ను ఓ పశువుగా చేర్చి అవసరమైనపుడు స్టూడియోలకి తోలుకెళ్ళేవాడు. ఏ గుంపులోనన్నా నిలబడ్డ రోజు ఐదో పదో పనిని బట్టి దొరికేవి డబ్బులు.

"నా సంపాదనలో సగం యిస్తానని నన్ను వాళ్ళింటి లోనే వుంచుకుని ఇంత తిండి పడేయమని ఆవిడని బ్రతిమిలాడాను. నేను ఒక్కత్తెనీ వుండగలిగే మనస్థైర్యం వచ్చే వరకు ఇంటిలో వుంచుకోమని ప్రాధేయ పడ్డాను. అలాగే వుంచుకున్నారు.

"ఆ రోజులు గురించి తల్చుకుంటే భయంతో వళ్ళు జలదరిస్తుంది. లేకపోతే నాలాంటి అనామిక, అనాకారికి అంతకంటె మంచి బ్రతుకు వుంటుందని ఆశించడం వీలులేనిది గదా! ఆ ఎక్‌స్ట్రాలలోనూ ఎన్ని రకాలు-ఒక్క ఫ్రేంలో, సింగిల్ షాట్‌లో కనిపిస్తే పొంగిపోయేవాళ్ళు, ఒక్క ముక్క డైలాగుంటే కొండెక్కినంత సంబరపడేవాళ్ళు— ఏ దాసీ దానిగా కనపడినా పెద్దతార అయినంత బ్రహ్మానంద పడే వాళ్లు— అల్ప సంతోషులు! అబ్బ! ఆ మందలో మందలా బ్రతికాను రెండేళ్ళు!"

"ప్రొద్దుటే వేన్‌లో ఎక్కించి ఏ స్టూడియోకో తీసికెళ్ళి దింపేవారు. ఏ చెట్ల క్రిందో, రంగులు పులుముకుని వాళ్ళిచ్చిన గుడ్డలు కట్టుకుని చెమటలు కార్చుకుంటూ అలా రోజంతా కూర్చునేవాళ్ళం. వాళ్ళకు దయపుడితే ఎప్పుడో ఇంత కాఫీ టిఫిను మా మొహాన పోసేవారు. ఎప్పటికో

మాకు పిలుపు వచ్చేది. ఏ గుంపులోనో నిల్చుని మా సీను అయ్యేవరకు కాచుకునేవాళ్ళం. ఎక్స్ట్రా జీవితం గురించి క్రొత్తగా నే చెప్పనక్కరలేదు. నీకూ తెలిసే వుంటుంది. ఆ నికృష్ట జీవితం రెండేళ్ళు గడిపాను.

"ఒకసారి అదృష్టవశాత్తు ఓ అవకాశం తోసుకు వచ్చింది. ఆరోజు ఓ సినిమాలో హీరోయిన్ కాలేజీ స్నేహితురాలిగా ఓ డైలాగు చెప్పాల్సిన వేషం వేయాల్సిన ఎక్స్ట్రా ఆరోజు జ్వరంవచ్చి రాలేదు. రాని అమ్మాయి కోసం విసుక్కున్నారు. సెట్ సిద్ధం, హీరో హీరోయిన్ రెడీగావున్నారు. చిన్న ఎక్స్ట్రా రానందుకు షూటింగ్ ఆగదు గదా! ఆ వున్న గుంపులో ఎవరినో ఒకరిని గబగబ వేషం వేయించమన్నారు. అందరిని సంతలో పశువులమాదిరి నిలబెట్టి అసిస్టెంట్ శల్యపరీక్ష చేశారు.

"నా అదృష్టం బాగుండబట్టి అతని దృష్టి నామీాద నిల్చింది. మేకప్ చేశారు. కాలేజీ అమ్మాయిని గనక మంచి చీర అది గట్టి ఫేషనబుల్ గా తయారుచేశారు. నేను చెప్పాల్సిన డైలాగు రెండు మూడుసార్లు చెప్పించారు. ఈ లైటింగులు, కెమెరాలు అన్నీ అలవాటయినవే గనక జంకు గొంకు లేకుండా ధైర్యంగా ఏక్ట్ చేశాను. డైలాగు బాగానే చెప్పాను. చిత్రంలో నా పోర్షన్ చూస్తూంటే నేనేనా అని ఆశ్చర్యపోయాను.

"అంత అందంగా కనిపిస్తున్న ఆ అమ్మాయి నేనాఅన్నట్టు డైరెక్టరు హీరో దగ్గరనించి అందరూ ఆశ్చర్యంగాచూశారు. మంచి ఫొటో జెనిక్ ఫేస్ అంటూ కెమెరామెన్ మెచ్చు

కున్నాడు. ఉచ్చారణ గొంతు అన్నీ చాలా బాగున్నాయి అని అంతా పొగిడారు పొంగిపోయాను. నా దశ తిరగడానికి అదే నాంది !

ఆ పిక్చరు తరువాత పిక్చరుకి అదే తారని బుక్ చేసిన ప్రొడ్యూసరు-ఆ సినిమాలో ఆ తార కాల్‌షీట్లు అవి సరిగా యివ్వకుండా నానా ఇబ్బంది పెడ్తూంటే విసిగి పోయాడు. చెంపలు వేసుకుని కాంట్రాక్ట్ రద్దు చేసుకున్నాడు. తరువాత చిత్రానికి ఎవరన్నా క్రొత్త తారని తీసుకోవా లనుకుంటూంటే కెమెరామాన్ నా పేరు సూచించాడట. చాలా బాగుంది, ఆ అమ్మాయిని తీసుకుని క్రొత్త తారగా ఇంట్రడ్యూస్ చేస్తే లాభానికి లాభం, ఓ క్రొత్త తారని పైకి తెచ్చిన పేరు వస్తుందని అసిస్టెంట్సు డైరక్టరు అందరూ చెప్పారట. ఇంకేం నాకు వరస పెట్టి స్క్రీన్ టెస్టులు, వాయిస్ టెస్టు, ఏక్టింగ్ టెస్టు అన్నీ చేయించారు. అద్భుతం అన్నారంతా. ప్రొడ్యూసరు రొట్టెవిరిగి నేతిలోపడింది. నన్ను చాలా తక్కువకి బుక్ చేసి ఆ చిత్రంలో నాయికగా వేయించాడు.

"నా మొదటిసినిమా బ్రహ్మాండమైన హిట్ అయింది. నా అందం అంతా కళ్ళలోనే వుందన్నారు. నా ఎక్స్‌ప్రెషన్స్ అంతా కళ్ళే అన్నారు. 'నయనతార' అని పేరు మార్చారు. నటించలేదు జీవించిందన్నారు. ఆ పాత్రకోసమే పుట్టిందన్నారు. బోరన్ ఏక్ట్రెస్ అన్నారు. అందాల తార అన్నారు. ఓహ్....ఆనాటి నా ఆనందం ఏం చెప్పగలను! ఆ సినిమా చూస్తూంటే నాలో అంత టాలెంట్ దాగివుందని

నాకే తెలియలేదు. అటు ఆర్థికంగా ప్రాధాన్యానికి యిటు పేరుప్రఖ్యాతులు నాకు తెచ్చిపెట్టింది ఆ పిక్చరు.

"తరువాత-తరువాత ఇంకేంవుంది! ఓవర్‌నైటు తారాపథాన్ని అందుకున్నాను; బిజీ నటి నయ్యాను. కంట్రాక్ట్సుమీద కంట్రాక్ట్సు! రేటు పెరిగిపోయింది. అప్పటి నించి ఇప్పటివరకు ఏకబిగిని మూడు కాల్‌షీట్సు పని చేస్తున్నాను. అదృష్టవశాత్తు ఇప్పటివరకు నా పిక్చర్ ఏదీ ఫేలవలేదు. రూపాయి డబ్బులకోసం మొహంవాచిపోయిన నాకు, ఇప్పుడు ప్రయత్నం లేకుండానే లక్షలు వచ్చిపడుతున్నాయి." తార నవ్వుతూ ముగించింది.

"అందుకే అదృష్టవంతులని పాడుచేసే వారెవరు అన్నారు. ఐ కంగ్రాట్యులేట్ యూ సుందరీ" అన్నాడు సారథి మనస్ఫూర్తిగా లేచినిల్చుంటూ.

"వెళ్ళిపోతావా!—" అంది తార.

"వెళ్ళద్దూ—పదకొండు దాటింది, నీకూ షూటింగ్ అదీ వుండదూ మళ్ళీ ప్రొద్దుటే—"

తార బదకంగా ఆవలించింది-"అవును ప్రొద్దుట ఆరు గంటలకల్లా లేచి వెళ్ళాలి—ఈపూట హీరోకి వంట్లో బాగు లేదని కాన్సిల్ అయింది షూటింగ్. అంచేతే అలా సినిమా చూద్దామని వచ్చాను. లేకపోతే సినిమా చూసే సమయం ఎక్కడుంది నాకు. నేను నటించిన సినిమా ప్రేక్షకుల మధ్య కూర్చుని వాళ్ళ కామెంట్సు వింటూ చూడ్డం సరదా నాకు. ఎప్పుడోగాని వెళ్ళడం కుదరదు. వెడితే ఎవరో ఒకరు

గుర్తుపట్టి అల్లరిచేసి చుట్టూ మూగుతారు. ఇదివరకులాగ ఎక్కడికిపడితే అక్కడికి ఫ్రీగా వెళ్ళడం కుదరదు— ముందులో అయితే ఇంతమంది అభిమానులు నాకున్నారని ఆనందంగా గర్వంగా వుండేది—యిప్పుడయితే గుంపుని చూస్తే చిరాకు—సరే పద, నిన్ను దిగబెడ్తాను."

"డ్రైవరు లేడూ—ఇంత రాత్రి నీవెందుకు రావడం. నేవెడతా, ఏ టాక్సీనో చూసుకుంటా లే—"

"ఇక్కడెక్కడా టాక్సీలు దొరకవు, రెండు మూడు ఫర్లాంగులు నడిస్తే తప్ప. ఇంతరాత్రి తీసుకొచ్చి నడిపించి పంపించనా—పరవాలేదు రా—"

"అప్పుడప్పుడు వస్తూండు-ఎందుకో నిన్ను చూశాక ఎవరో ఆప్తుడు కనపడినట్టు ప్రాణం లేచివచ్చింది-" కారులో అంది తార ఆర్ద్రంగా.

"నీలాంటి బిజీతార దర్శనం నాలాంటి వాళ్ళకి దొరుకుతుందా, మీ ఘూర్కా గెంటేస్తాడేమో నేను వస్తే—" హాస్యంగా అన్నాడు సారథి.

"ఛా—అలా ఎందుకు చేస్తాడు—నేను చెపుతా వాడితో—నీ వెప్పుడు వచ్చినా సరాసరి పైకి తీసుకురమ్మని. వచ్చేముందు ఫోనుచేసి వస్తూండు, నేనింటో వున్నదీ లేనిదీ అడిగి. నా నెంబర్ నోటుచేసుకో. నీ ఆఫీసు నెంబరు రాసియ్యి. వీలున్నప్పుడు నేను చేస్తా."

"తప్పకుండావస్తానుసుందరీ. ఇంత గొప్పదానివయినా యీ పాత మిత్రుడిని ఇంత ఆదరంగా రమ్మని ఆహ్వానిస్తే రాకుండా ఎలావుంటాను ?"

"అదిగో నీవూ అలాగే అనుకుంటున్నా వన్నమాట. సినీతార అయినంతమాత్రాన మాకూ మనసులు, సెంటిమెంట్స్ అవీ వుండని బండరాళ్ళ మనుకుంటున్నావా ?...."

"అందుకు కాదు ... నీవు నోరు తెరిచి ఆపదలో సహాయం కోరినా ఏం చెయ్యలేకపోయాను ఆనాడు, యీ రోజు ఏ మొహం పెట్టుకుని నీ దగ్గిరికి రావాలీ ." బిడియంగా అన్నాడు సారథి.

"అదా. పరవాలేదు నీవుమాత్రం ఏం చేస్తావు. అంత హఠాత్తుగా వచ్చి అడిగితే నీవే మరొకరి ఆధారంమీద వున్నవాడివి నన్నేం ఆదుకుంటావు. ఆ విషయంలో నేనేం అనుకోలేదు. ఫర్ గెట్ ఇట్. అదేం మనసులో నాకు లేదు." అంది తార.

"థేంక్స్. అదిగో. ఆ గల్లీలోకి తిప్పు ... ఇక్కడే ఆపెయ్యి కారు. ముందుకి ఇంత పెద్దకారు వెళ్ళదు. అదిగో ఆ కనిపిస్తున్న పచ్చమేడలేదూ, ఆ మేడమీద గదే నాది. వుంటా సుందరీ. మెనీ, మెనీ థాంక్స్ ఫర్ యువర్."

"దేనికి థాంక్స్. చాలా మాటలు నేర్చావు. అచ్ఛా. బై ... గుడ్ నైట్ ఫోన్ చేస్తా..." అంటూనే తార కారుని వెనక్కి తిప్పింది.

సుందరి ... తారతో ఇంతసేపు గడిపినా ఇంకా నమ్మశక్యం కాని విషయంలాగే ఆశ్చర్యంగా ఆలోచిస్తూ పడుకున్నాడు, సారథి పాతసంగతులతోపాటు ... యీ రోజు సంఘటన గురించీ !

రోజూ. ప్రక్కమీద వాలగానే అలసటతో, ఆద మరిచి నిద్రపోయే తారకి ఆరోజు ఎంతసేపటికీ నిద్రపట్టక దొర్లింది.

* * *

"హల్లో ... హల్లో సారథీ. మంచివాడివే. ఇదేనా రావడం, పదిహేనురోజులనుంచి వస్తావేమోనని రోజూ చూస్తున్నాను...నన్నప్పుడే మరిచిపోయినట్లున్నావుగాదూ." నిష్ఠూరంగా అంది తార.

"సారీ. వెరీసారీ ... యీమధ్య ఆఫీసులో పనెక్కువగా వుంటోంది. ఇంటికొచ్చేసరికి ఆలశ్యం అయిపోతూంది. ఆమధ్య రెండుసార్లు ఫోను చేశాను. నీవు లేవన్నారు."

"సరేపోనీగాని, యీరోజు సాయంత్రం రాకూడదూ. నాకు షూటింగ్ లేదు. ఫ్రీగా వున్నాను ... కాసేపు కూర్చోవచ్చు ..."

"ఇవాళా ... ఆఫీసులోపని ... ఏమాత్రం వీలున్నా వస్తా."

"వెయిట్ చేస్తూంటాను. తప్పక రావాలి. ఆలశ్యం అయినా పరవాలేదు." తార అర్థింపుగా అంది.

ఫోను పెట్టేశాక సారథి మనసు పనిలో లగ్నం కాలేకపోయింది. సుందరి ... సుందరికి తనమీద ఎందుకంత ఇంటరెస్ట్ ! ఇంత పెద్ద నటి అయి ఇంత సిరిసంపదలున్న సుందరికి తనలాంటి ఒక సామాన్యుడి సహవాసం ఎందుకు? కేవలం పాతపరిచయం పురస్కరించుకుని పిలుస్తుందా !

అలా అనుకోడానికన్నా తనకీ సుందరికీవున్న పరిచయం మాత్రం ఎంత! ఎదురింట్లో వుండేవారు, ఆమె తండ్రికి ఎప్పుడన్నా డబ్బవసరం వున్నప్పుడు అప్పిచ్చేవాడు. దానికిబదులు అప్పుడప్పుడు భోజనానికి రమ్మనేవారు. సుందరితో తను ఎదుటబడి మాట్లాడడంకూడా ఎప్పుడూ లేదు. సుందరికేమో గానీ సుందరిమీద తన కెలాంటి అభిప్రాయమూ లేదు అప్పుడు.

కేవలం అప్పుడప్పుడు ఆ అమ్మాయి అనాకారితనాన్ని చూసి ఈ పిల్లకి పెళ్ళి ఎలా అవుతుంది తండ్రి ఎలా చేస్తాడు డబ్బుకూడా లేదు అనుకుని జాలిపడేవాడు. ఆ అమ్మాయి తనని ఆకర్షించడానికిపడే ఆరాటం చూసి పిచ్చిమొద్దు అని నవ్వుకునేవాడు. తారయీనాడు తనతో పెద్ద పరిచయస్తురాలిలా ఎందుకు వ్యవహరిస్తుంది. ఆమెకి కావాలంటే తనమాత్రం పరిచయం వున్నవాళ్ళు లక్షల మంది దొరుకుతారు. మేటి నటీనటులు, మిత్రులు ఎంతో మందిమధ్య తనని గుర్తుంచుకుని ఫోనుచేసి మరీ పిలిచిన సుందరి సహృదయతని మెచ్చుకోకుండా వుండలేకపోయినా, ఆమెముందు యీనాడు తగ్గినిలబడ్డానికే సారథి కెందుకో చిన్నతనంగా వుంది. ఓనాడు తిరస్కరించిన తన తిరస్కారాన్ని మరచి మళ్ళీ స్నేహంగా ఆమె వుండగలిగినా సారథి గిల్టీగా ఫీలవుతున్నాడు. అస్తమానం వెడితే ఈనాడు తను పనికొచ్చింది గాబోలు అని ఎక్కడనుకుంటుందోనని కూడా మనసులో జంకాడు. కానీ ... సుందరి ... సహృదయంతో

నిష్కపటంగా ఆహ్వానిస్తూంది. రమ్మంటుంది. వెళ్ళకుండా ఎలా వుండగలడు !

సారథి సాయంత్రం తార ఇంటికి వెళ్ళేసరికి ఏడుగంట లవుతూంది. హాలులో సుందరి తండ్రి సారథినిచూసి పలక రించాడు. "నీవా బాబూ, ఎవరో అనుకుని పలకరించలేదు ఆరోజు . . ఆ రేళ్ళయింది చూసి పెద్దతనం మరుపు వచ్చే సింది, అయినా బాగా మారిపోయావు. వళ్ళుచేశావు బాగా. కులాసాగా వున్నావా ? ... అమ్మాయి చెప్పింది నీవని ... మా సుందూకోసం వచ్చావా, వెళ్ళు, పైన వుంది" అంటూ పల్కరించాడు. మర్యాద మాటలు, యోగక్షేమాలు అడిగి సారథి పైకి వెళ్ళాడు.

తార ఎవరికో ఫోన్ చేస్తూంది ... ఫోన్ చేస్తూనే సారథిని చూసి కూర్చోమని సైగచేసింది ... "యు సిల్లీ ... ఏమిటా మాటలు" ఎవరితోనో నవ్వుతూ ముద్దు ముద్దుగా మాట్లాడుతూంది ... "చాల్లే ఇంక, ఫోను పెట్టేస్తున్నాను. మా ఫ్రెండు ఒకరు వచ్చారు ... ఎవరో లే నీకు తెలియదు. అబ్బ ! ఏవిటా ఇంటరెస్టు — ఎవరయితే నీకెందుకు. ఊహు ... కిరణ్ కాదు ... అనంత అసలే కాదు ... నేను చెప్పను ... ఏమిటి అంత అసూయ...ఉడుక్కోకు. నా ఫ్రెండు, చిన్నప్పటి ఫ్రెండులే. షటప్. నీవనుకునేదేం కాదు. అచ్చా. బై బై. తరువాత మళ్ళీ మాట్లాడుకుందాం." ఫోను పెట్టేసి తార సారథిని చూసి నవ్వింది. ఆ సంభాషణ, ఆమె నవ్వు, ఏమిటోలా అన్పించింది సారథికి. ఆక్వర్డుగా కూర్చున్నాడు.

"బొత్తిగా నల్లపూసవయిపోయావు, మళ్లీ రానే లేదు" పలకరించింది.

"చెప్పాగా, ఆఫీసుపని అని. బిజీగా వుంటావు నీ వెప్పుడూ. నిన్ను డిస్టర్బ్ చేయడం ఎందుకని."

"నా బిజీ ఎప్పుడూ వుండేదే. నీలాంటివాళ్ళు వచ్చి నప్పుడే కాస్త రొటీన్ నించి రిలీఫ్ దొరికినట్టుంటుంది. లేక పోతే ఎప్పుడూ ఏముంది, రంగేసుకుని అలా చమటలు కార్చు కుంటూ గంటలకి గంటలు ఆ లైటుల పెడ్డలో కూర్చోడమేగా మా బ్రతుకు."

"అయితే అంత కష్టపడడం ఎందుకు! అన్నేసి పిక్చర్లు ఒకసారి వప్పుకోవడం ఎందుకు ? అంత విశ్రాంతి లేకుండా పని ఎవరు చేయమన్నారు ?"

"నీకు తెలీదు. ఈ డబ్బన్నది సంపాదించడం ఆరంభిం చాక ఈ దాహం తీరడం అన్నది వుండదు. త్రాగినకొద్ది దాహం ఎక్కువవుతూంటుంది. అంతేకాక ఈ సినీ జీవితంలో ఎవరెన్నాళ్ళు వెలుగుతారో తెలియదు. డిమాండ్ వున్న ప్పుడే నాలుగు డబ్బులు చేర్చుకోవాలన్న ఆరాటం వుంటుంది. ఖర్మకాలి ఒకటి రెండుపిక్చర్లు ఫేలయ్యాయనుకో, మన మొహం చూడరు. అంచేత దీపం వుండగానే ఇల్లు చక్కపెట్టుకోవాలన్న తాపత్రయం వుంటుంది. కొందరిని కాదనలేక, కొందరితో మొహమాటాలూ, మరికొందరితో కృతజ్ఞత, ఏదో విధంగా కాదనలేని పరిస్థితి. ఏం చెయ్యా మంటావు."

"బాగుంది. ఆరోగ్యం సంగతటుంచి బొత్తిగా బయట ప్రపంచంతో సంబంధం వుండదుగదూ. ఏ సరదాలకి టైముండదనుకుంటాను."

"చెపుతున్నానుగా. ఏ లైఫ్ లేదు మాకు. ఒకసినిమా చూద్దామంటే కుదరదు. ఏ ఫ్రెండ్సు ఇళ్ళకి వెళ్ళాలన్నా వీలవదు, ఓ పికారు లేదు, పుస్తకం చదవడానికన్నా అవదు. ఆ స్టూడియోలో వున్నంతసేపూ మేకప్‌తో పాటు నవ్వు ముఖానికి పులుముకుని తోటినటులతో ఏవో పిచ్చి మాటలు మాట్లాడడం — అందులో అభిమానాలు, ఆప్యాయత లుండవు. ఆ సినిమాలో నటిస్తున్నంతసేపూ ఆ ప్రొడ్యూసర్లు, తోటి నటులు అంతా పలకరిస్తున్నా అంతా బిజినెస్‌లైఫ్‌గా వుంటుంది. అందుకే నీలాంటివాళ్ళు కనపడగానే ఏదో రిలీఫ్ దొరికినట్లుంటుంది."

"ఇందాక నేను వచ్చేసరికి యెవరితోనో అంతచక్కగా మాట్లాడుతున్నావు. ఫ్రెండ్సు లేకపోవడం ఏమిటి?–" అవకాశం వచ్చేసరికి మనసులో ఇందాకటినించి దొలుస్తున్న ప్రశ్న అడగకుండా వుండలేకపోయాడు సారథి. తార నిర్లక్ష్యంగా నవ్వింది.

"అతనా! హీరో శ్యామ్."

"నీకు ఫ్రెండా ?"

"నా మొహం. ఏదో మా మాటలు అందరితో అలాగే వుంటాయిలే. సినిమాలోనేగాదూ, నిజజీవితంలోనూ నటన అలవాటయిపోయింది. నటినిగదా!" తార అదోలా నవ్వుతూ అంది.

అర్థంగానట్టు చూశాడు సారథి. అది చూడనట్లు తార మాటమారుస్తూ తన ప్రక్కనున్న టేబిల్ మీద నించి ఓ కవరుతీసింది. "అన్నట్టు మర్చిపోయాను. మా చెల్లెలి పెళ్ళి ఈ పదిహేనో తారీకు తిరుపతిలో. శుభలేఖ ఇదిగో" అంటూ కవరుమీద సారథి పేరురాసి అందించింది తార.

"మీ చెల్లెలు పెళ్లా!" కవరందుకుంటూ ఆశ్చర్యంగా అడిగాడు సారథి.

"ఉ.. వల్లి... గుర్తుందా. అప్పటికింకా పరికిణీలు తొడుక్కుంటూ వుండేది. ఆడపిల్లలు ఎంతలో పెద్దవాళ్ళవుతారు."

"అదికాదు, అందుకుకాదు, పెద్దదానివి నీవుండగా మీ చెల్లిలికి ముందు పెళ్ళి ఏమిటి అని!" శుభలేఖ విప్పి చూస్తూ అన్నాడు సారథి. తార మొహం అదో రకంగా అయింది. క్రింది పెదవి కొరుక్కుంది. మరుక్షణంలో మొహంలో భావం మార్చేసి తేలికగా నవ్వుతూ, "పెళ్లా నాకా! నన్నెవరు చేసుకుంటారు? నాకెవరు చేస్తారు?" అంది.

"పెద్ద తారవి. నీ...ఊఁ, అంటే రేపొద్దున మైలు పొడుగున పెళ్ళికొడుకులు క్యూ తయారవుతుంది. నీకేమిటి. ఇంకా గుమస్తా కూతురు సుందరిలా మాట్లాడుతావేమిటి?"

"అలాగా. అంటే, దీనర్థం? ఈ పెళ్ళికొడుకులు సుందరిని కాదన్నమాట చేసుకోడానికి వచ్చినది. తార ఆర్జించిన లక్షల నన్నమాటే గాదూ."

సారథి తడబడ్డాడు ఒక్క క్షణం. "అఫ్‌కోర్స్. ఆ మాట నిజమే అనుకో. కానీ ఏదో ఒక ఎట్రాక్షన్ వుండాలని కోరుకుంటే అది అవతలి వాళ్ళతప్పుగాదు గదా, మనుషులు ప్రలోభపడడం సహజం గదా !"

"అంటే...అంటే, ఈ నల్లని సుందరి ఈ మనిషి గాదు కావల్సింది ఎవరికి, నా డబ్బు, నా ఆర్జనమీద మోజు అన్న విషయం స్పష్టంగా తెలిసీ చేసుకోమన్నావా ! ఆ వచ్చే మనిషి ఈ వున్నవాళ్ళతో జమఅయి నా సంపాదనకోసం రాబందుల్లా కాచుకుని పీక్కుతింటాడన్న సంగతి తెలిసి మరో మనిషిని పీళ్ళు చాలరన్నట్టు జత చేయమన్నావా -" అంటూంటే తార కంఠం రుద్ధమయింది. "నేనెవరికీ అక్కర లేదు. నా కష్టసుఖా లెవరికీ అక్కర లేదు. నా మీద సానుభూతి లేదు- నా సంపాదన మీద తప్ప నా మీద యెవరికీ ఇంటరెస్టు లేదు- వుండదు" ఉక్రోషంగా అంటున్న తార కళ్లు తడి అయ్యాయి.

"సుందరీ !" సారథి తెల్లబోయాడు.

"నీకు తెలీదు సారథీ. ఈ డబ్బు యెంత పాపిష్టిదో, ఈ మనుష్యులు ఎలాంటివారో. డబ్బుముందు కన్న తల్లి తండ్రులు సయితం ఎలా మారిపోతారో నీకర్థంగాదు. నా డబ్బు తింటూ పెళ్ళి కావల్సినదాన్ని నేనుండగా, నా డబ్బుతోనే నా చెల్లెలి పెళ్ళి ముందు చేసేస్తున్నారు. నాకెలా వుంటుందో ఆలోచించు. నేనూ మనిషినే. నాకూ ఓ మనసుంది. నాకూ ఓ భర్త, సంసారం, పిల్లలు - నావాళ్ళనుకునే వాళ్ళు, నన్ను కావాలనుకునేవాళ్ళు కావాలని ఉండ

దంటావా !—" తార కళ్ళలో నీళ్ళు! తార ఎందుకో బాధ పడ్తూంది.

ఏమనాలో అర్థంగానిస్థితిలో సారధి అయోమయంగా చూశాడు. "నేనింట్లో వున్నట్టే మరిచిపోయారు. నేనూ వాళ్ళ కూతురినని, నాకూ పెళ్ళి చేయాల్సిన బాధ్యత వాళ్ళకి లేనట్టే మరిచిపోయి చెల్లిలి పెళ్ళిచేస్తున్నారు. నేను డబ్బు సంపాదించే యంత్రంగా తప్ప మనిషిగా ఎవరికీ కన పడడంలేదు. సారధీ, నేనేదో సుఖపడి పోతున్నాననుకుంటు న్నావు నీకు తెలియదు నా మానసిక క్షోభ ?" అంటూ కళ్ళు ఒత్తుకుంది తార.

"సుందరీ, అదేమిటి మీా అమ్మ నాన్నగారు అన్న తమ్ముళమధ్య, ఇంత సిరిసంపదలమధ్య నీవు సుఖంగాలేవూ. నిన్ను చూసి అదృష్టవంతురాల వయావని అనుకున్నాను. ఎందుకు బాధపడుతున్నావు. నీకేమిటిలోటు. నీ కిష్టంలేక పోతే వీళ్ళందరిని వెళ్ళిపొమ్మను. వీళ్ళూ వాళ్ళూ నీకు పెళ్ళి చేసేదేమిటి నీవే చేసుకో. అంతేగాని..." ఆవేశంగా అన్నాడు సారధి. తార ఇటు అటు చూసి లేచినిల్చుంది.

"సారధీ, మనం అలా బీచ్‌కి వెడదామా. జస్ట్ ఎ మినిట్ చీరమార్చుకు వస్తాను."

"హాయిగా అక్కడ కూర్చుదాం కాసేపు. యీా ఇంట్లోంచి కాసేపు పోతే హాయిగా వుంటుంది ప్రాణం. అక్కడ చెపుతా నీకు కొన్నిసంగతులు" అంటూ లోపలి కెళ్ళింది. సారధి ఆశ్చర్యంగా చూస్తుండిపోయాడు.

"సుందరీ. ఏమిటో చెప్తానన్నావు. నీ కభ్యంతరం లేకపోతే చెప్పనాకు. నిన్ను చూస్తుంటే నీ కెందుకో చాలా బాధపడుతున్నట్టు కనిపిస్తుంది." బీచ్‌లో దూరంగా నిర్మానుష్యంగా వున్నచోట ఎందుకని ఇద్దరూ కూర్చున్న కాసేపటికి, తార ఎంతకీ మాట్లాడకపోవడం చూసి సారథి అడిగాడు ఆరాటంగా.

"అవును చెప్తాను. చెప్పితేనన్నా కాస్త మనసులో భారం తగ్గుతుందేమో." భారంగా అంది.

"ఒక ప్రశ్న. నీ విలా సినిమాలలో నటించడానికి మీవాళ్ళు ఏమీ అనలేదు, వప్పుకున్నారూ."

తార అదోలా నవ్వింది. "నీ వెంత పిచ్చివాడివి. తిండికి గతిలేని తల్లితండ్రులు కూతురు లక్షలు ఆర్జిస్తూంటే వద్దనేటంత వెర్రివాళ్ళు ఈ లోకంలో వుంటారంటావా ?"

"అయితే మీ వాళ్ళకి ఎలా తెలిసింది నీ విలా నటివి అయినట్టు. ఇంటిలోంచి వెళ్ళిపోయేక రాశావా ?"

"ఊహు. నేను ఎక్‌స్ట్రాగా బ్రతికినన్నాళ్ళూ నా సంగతి ఎవరికీ తెలియదు. నేనూ రాయలేదు. కాని నా మొదటి సినిమా అయ్యాక డబ్బు చేతిలోపడ్డాక, ఏదీలేక గిలగిలలాడే నావాళ్ళ దీనావస్థ కళ్ళముందు కదిలింది. నేనిక్కడ రాజభోగాలు అనుభవిస్తూంటే వాళ్ళకూడా ప్రతిపూట తిండికితడుముకునే దుస్థితిలో వుండటం తల్చుకుంటే కూతురిగా నా తల్లి తండ్రులని ఆదుకోడం నా ధర్మమనిపించింది.

"ఓ రెండువేలు పంపిస్తూ నాగురించి రాశాను. అదే నేనుచేసిన పొరపాటు. డబ్బు అందిన మర్నాడు నాన్నగారు బయలుదేరి వచ్చేశారు. ఆడముండలు నా ప్రాణం తీయడానికి పుట్టారు. చావనేనా చావరు అంటూ రోజూ శాపనార్థాలు పెట్టే ఆయనకి నామీద ప్రేమ పొంగి పొరలింది. ఇన్నాళ్ళూ నా యోగక్షేమాలు రాయనందుకు తిట్టారు. నన్ను కావలించుకు కన్నీళ్ళు పెట్టుకున్నారు. అమ్మ నామీద బెంగపెట్టేసుకుందన్నారు. నన్ను చూడాలని అందరూ పలవరిస్తూన్నారట. ఇంట్లో ఎవరికి నిద్రాహారాలు లేవట-ఆ మాటలు వింటూ నేనూ ఏడ్చాను

"అమ్మని వెంటనే రమ్మని టెలిగ్రాం ఇచ్చారు నాన్నగారు. అమ్మ, అమ్మతోపాటు చెల్లెలు తమ్ముడు అందరూ తప్పరుగదా! అన్నయ్యకి పాపం యీ చెల్లెలిమీద ఎక్కడలేని ప్రేమ పుట్టుకొచ్చి చూడడానికి వచ్చి, మరి ఈ చెల్లెలినివదలలేకవుండిపోయాడు ఇక్కడే. అలాగే ఉద్యోగం లేని బావలు, డబ్బుచాలని బావలు, తిండికి కటకటలాడే పినతండ్రులు, మేనత్తలు నేనెప్పుడూ చూడని వాళ్ళకి సయితం నేను డబ్బు ఆర్జిస్తున్న సంగతి తెలిసి అభిమానంగా నన్ను చూడాలని వచ్చారు. ఈ సత్రంలో మనం తిన్నంత మాత్రాన లక్షలార్జిస్తున్న తారకి ఏం నష్టం వుండదులే అన్నట్లు పాపం వాళ్ళంతా యిక్కడే వుండిపోయారు, నన్ను వదలలేక."

"అదేమిటి, నీవెలా వూరుకున్నావు? నీ తల్లితండ్రులంటే అర్థం వుందిగాని అక్కలు, అన్నలు, మిగిలినవాళ్లు... ఇందరినీ భరిస్తున్నావా?"

"భరించక ఏం చెయ్యమంటావు? ముందులో... నేను బీదరికం, కష్టాలు అనుభవించినదాన్ని కనక వాళ్ళ కష్టాలకి జాలిపడ్డాను. ఇంత ఆర్జిస్తున్నాను. నేను ఒక్కతినీ ఈ డబ్బు ఏం చేసుకుంటాను. లేని నావాళ్ళని ఆదుకుంటే నా సంపద ఏం తరగదు. అని అనుకున్నాను. తరువాత ఇంతమందిని ఆదుకుంటున్నా నన్న తృప్తికోన్నాళ్ళు పడ్డాను. వాళ్ళందరి చేత మంచిదాన్ననిపించుకోవడం. నేనేదో చాలాగొప్ప పని చేస్తున్నానని గర్వం, స్వార్థం నన్ను వశపరుచుకున్నాయి. కాని నా జాలిని, సానుభూతిని, నా సహాయాన్ని యిలా దుర్వినియోగం చేసి, తిన్న ఇంటికే వాసాలు లెక్కపెట్టే వాళ్ళుగా మారుతారని నా డబ్బు తింటున్న విశ్వాసం, కృతజ్ఞత లేని కృతఘ్నులుగా తయారవుతారని ఎలా అనుకుంటాను" ఆవేశంగా అంది తార.

"అమ్మ, నాన్నగారు వస్తూనే యింటి అజమాయిషీ తీసుకున్నారు. నాకు టైము లేదు చూసుకునే చాకచక్యం లేదు గనక అంతా అమ్మ, నాన్నలమీద వదిలేశాను. అన్నయ్యా వస్తూనే 'అమ్మలూ, యింత పిచ్చిదానివి ఎలా బ్రతుకుతావు, నీకేమి తెలియదు' అంటూ నా బిజినెస్ వ్యవహారాలు చేతిలోకి తీసుకున్నాడు. నిజంగానే నే చదువురానిదాన్ని, వ్యవహారదక్షత తెలియనిదాన్ని, డబ్బిచ్చి ఎవడో సెక్రటరీని పెట్టుకునేకంటే నా అన్నయ్యా, నా ఆప్తుడు నా వ్యవహా

రాలు చూడడం అదృష్టం అనుకున్నాను. ఆనాటినుంచి అన్నయ్యే నా కేర్ టేకర్, సెక్రటరీ వగైరాలు.

"ప్రొడ్యూసర్లతో లావాదేవీలు, ఇన్ కంటాక్స్ లు, ఆఖరికి ప్రొడ్యూసర్ల కథలు వినడం దగ్గిరనించి అన్నీ అన్నయ్యే చేసేవాడు. ఎక్కడ సంతకం పెట్టమంటే ఆ అగ్రి మెంటుమీద సంతకం పెట్టడం, అన్నయ్య కాల్ షీట్లు యిచ్చినవాళ్ళ షూటింగులకి ఎక్కడికి తీసికెళ్ళితే అక్కడికి వెళ్ళి నా పాత్ర నటించడం వరకే నావంతు. మొదటిలో బాదరబందీ ఏం లేకుండా హాయిగా బాగానే వుండనిపించింది. ఆఖరాఖరికి అన్నయ్య చేతిలో నేనెలా కీలుబొమ్మనయిందీ తెలిసిరాలేదు. అన్నయ్యకి రోజురోజుకి నా సంపాదనమీద వ్యామోహం పెరిగిపోయింది. వచ్చిన ప్రతీ పిక్చరు వప్పు కునేవాడు. కొన్ని కథలు నాకు మరీ బొత్తిగా నచ్చక అదే మంటే "నీకు తెలీదమ్మా. దీపం వుండగానే యిల్లు చక్క పెట్టుకోవాలి. కథ బాగుందో లేదో నీకెందుకు నీకు కావల్సిన డబ్బు వాళ్లు యిస్తున్నారా లేదా అన్నదే ముఖ్యం. కథ బాగు లేకపోతే నష్టపోయేది వాళ్లేగా. వాళ్ళకి ఆమాత్రం తెలియదూ" అనేవాడు. ఏమనాలో తెలియక వూరుకునేదాన్ని. ఓసారి ఓ సినీపత్రికలో ఫలానా తార రేటు చాలా పెంచింది అన్న వార్త చదివేవరకు అసలు నా రేటెంతో, అన్నయ్య యిప్పుడు వసూలు చేస్తున్న దెంతో అన్న కుతూహలంతో అన్నయ్యా నడిగాను. "నీవుత్త పిచ్చిదానివే అమ్మడూ, డిమాండ్ వుండగానే నాలుగు డబ్బులు రాబట్టుకోవాలి. ఎవడికోసం యిస్తారు?

నీవంటే ఏమిటి అనుకున్నావు. అసలు నీకెందుకు ఈ గొడవ లన్నీ, ఆ తంటాలన్నీ పడడానికి నేనున్నాగా'' అంటూ మరి నేనేం అనే సందీయులేదు.

“అన్నయ్య డబ్బు ఆశతో వచ్చిన ప్రతి పిక్చరు వప్పేసుకుంటుంటే రోజుకి మూడు కాల్‌షీట్లు పనిచేస్తూ విశ్రాంతి అన్నది లేక నలిగిపోయేదాన్ని. అన్నేసి పిక్చర్లు వప్పుకోవద్దని అన్నయ్యకి చెప్పాలంటే భయంవేసేది. ఇంకా నేను పాతసుందరిలాగే ఇంటిలో అన్నయ్యంటే గడ గడలాడేదాన్ని. ఈ ఇంటిలో సంపాదిస్తున్నది నేనని, ఈ ఆర్జిస్తున్న లక్షలన్నీ నావని, ఇంటిలోవాళ్ళంతా నా దయా ధర్మంమీద బ్రతకాల్సిన వాళ్ళుకానీ, వాళ్ళకి నేను భయ పడవల్సినదాన్ని కానని కూడా తెలుసుకోలేనంత అదో రకం అమాయకంగా వుండేదాన్ని మొదట్లో. నేను అలిసి పోయి ఇంటికివచ్చి ఏ ప్రక్కమీదో వ్రాలిపోయేదాన్ని. ఇంటిలోవాళ్ళంతా చుట్టూ చేరేవారు మొదట్లో. ఒకళ్ళు మంచినీళ్ళిచ్చి, మరొకరు చెమట వత్తి, మరొకరు కాఫీ తెచ్చి నామీద అభిమానం కురిపించేవాళ్ళు — “ఏమిటండీ మీరు మరీ బొత్తిగా సుందరి ఆరోగ్యంగురించి పట్టించు కోకుండా అన్నేసి సినిమాలు వప్పేసుకుంటే ఎలా అండీ !'' అంటూ అన్నయ్యని వదిన సన్నసన్నగా మందలించేది.

“వరేయ్—నీకు బుద్ధిలేదురా, అన్ని సినిమాలయితే దాని ఆరోగ్యం ఏమవుతుందనుకున్నావు. దాని ఆరోగ్యం ముఖ్యమా డబ్బు ముఖ్యమా నీకు'' అంటూ నాన్న అన్నయ్యని మందలించేవారు.

"అయ్యో, పిల్ల తోటకూర కాడలాగ వాడిపోతూంది. మీ డబ్బాశతో దాన్ని చంపేస్తారేమిట్రా" అంటూ అమ్మ ఆదుర్దాపడేది.

"అన్నయ్య తప్పు చేసినవాడిలా తలదించుకుని "నేనేం చెయ్యను - మా తారకి టైము లేదు మొర్రో అన్నా వాళ్లు వినిపించుకోరు. పిక్చరు వప్పుకుంటే చాలంటారు ముందు. తరువాత కాల్ షీట్లు ఇచ్చేవరకు వెంట తిరుగుతారు. నేనేం చేయను. నాకు మనసుందాకంటె డబ్బు ముఖ్యమా ఏమిటి" అంటాడు అన్నయ్య. అంతా నా చుట్టూ చేరి ఇలా మాట్లాడుతూంటే నామీద వాళ్ళకివున్న అభిమానానికి, వాళ్ళందరికి నాపట్లవున్న శ్రద్ధాసక్తులకి మురిసిపోయేదాన్ని. లోలోపల నా వాళ్ళందరికి నామీద వున్న ప్రేమకి గర్వించే దాన్ని. కాని వాళ్ళందరూ చూపించే శ్రద్ధాసక్తులు నామీద గాదని నేను సంపాదించే డబ్బుమీద అన్న సంగతి చాలా రోజులకిగాని తెలుసుకోలేకపోయాను. ఇంటిలో మొదట్లో అమ్మ ఇది తిను అది తిను ఆపాలు తాగు పళ్ళు తిను అంటూంటే ఆమె ప్రేమకి పొంగిపోయేదాన్ని తప్ప అది ఎంత మేత పెడితే ఆవు అంత బాగా పాలిస్తుందన్న ఆరాటం అని, నా ఆరోగ్యంమీద వాళ్ళందరి భవిష్యత్తు సుఖ శాంతులు ఆధారపడి వున్నాయన్నది తర్వాత అర్థమైంది."

"నీ వాళ్ళందరూ మారిపోయారని, నిన్ను మోసం చేస్తున్నారన్నది ఎలా తెలుసుకున్నావు?" కుతూహలంగా వింటున్న సారథి మధ్యలో అడిగాడు.

"ఎలా ఏమిటి ? ఎంత అమాయకురాలైనా కొన్నాళ్ళ కన్నా గ్రహించలేరా ? ఒకటి రెండేళ్ళు అమాయకంగా వున్న నేనూ నలుగురిమధ్య తిరుగుతూ, నాలుగూ చదువుతూ కాస్త లోకజ్ఞానం అలవరుచుకున్నాను. ఈ ఇంటిలో అందరూ ఎవరికి వారు నన్ను మంచిచేసుకోడానికి నామీద ప్రేమ నటిస్తూ తమఒక్కరే నాకు నిజమైన శ్రేయోభిలాషులం అన్నట్లు మాట్లాడుతూ మిగతా అందరూ ఇంటిలోచేరి నన్నెలా అమాయకురాలినిచేసి దోచుకుంటున్నారో, ఆట లాడిస్తున్నారో చెప్పుతూండేవారు. మొదట్లో ఎవరేది చెపితే అది నమ్మేస్తూండేదాన్ని. కాని ఆఖరికి అందరిమాటలు వింటేఅంతాతోడుదొంగలేనని, నామీద నిజమైనఅభిమానం ఎవరికి లేదని, నేను పచ్చగావుండగానే ఎవరి గొడవలు వాళ్ళు నా డబ్బుతో చక్కదిద్దుకుంటున్నారని బోధపడింది. వాళ్ళలో వాళ్ళకి పడకపోయినా నన్ను వంచించడంలో అంతా ఒకటేనని తెలుసుకున్నాను.

"ఆఖరికి అమ్మ నాన్నకూడా అందరితోపాటు కలిసి పోయి నేను వాళ్ళ కూతురినన్నమాట మరిచి నన్ను డబ్బు సంపాదించే యంత్రంగా, ఆ డబ్బు వాళ్ళంతా ఖర్చు పెట్టు కోడం వాళ్ళ హక్కు అన్నట్టు ప్రవర్తించేవారు. కనీసం అమ్మకయినా నాపట్ల శ్రద్ధాసక్తులు లేవని, నాకేం కావాలో కూడా చూసే అభిమానం లేకపోయింది. మొదట్లో కాస్త శ్రద్ధకనపరిచే అందరూ రానురాను సంపాదించకేం చేస్తుంది అన్న ధోరణిలో నన్ను గురించి పట్టించుకోడం మానేశారు. నేనెలా తిరిగినా, ఎవరితో తిరిగినా, తిన్నా, మానినా

ఎవరికీ పట్టదు. ఇంటిలో నేను పెద్దదాన్ని వుండగా చెల్లెలు పెళ్ళి ఏర్పాటులు చేయడం ఆరంభించారు. అందుకు నేనేం అనుకోకుండా ఎంత గడుసుగా తప్పించుకున్నారో తెలుసా! అమ్మ ఏం తెలీనట్లు "అదేమిటండీ సుందూ పెళ్ళికాకుండా వల్లి పెళ్ళి ఎలా చేస్తాం" అంది. నాన్న చాలా గొప్పగా "వసే, నీ వుత్త వెర్రి మొహమే. నీసుందరి యిప్పుడు పాతసుందరి అనుకుంటున్నావేమిటే, అదిప్పుడు పెద్దతారే! అది కావా లంటే లక్షమంది పెళ్ళికొడుకులు వస్తారు. నీవు కుదిర్చే చచ్చుసంబంధాలు దానికెందుకే. దానికి నచ్చినవాడిని అది చేసుకుంటుంది. మధ్య నీ పెత్తనం నా పెత్తనం దానికక్కర లేదు." అన్నారు గడుసుగా. ఎంతయినా ఆడదాన్ని. నాకు పెళ్ళిచెయ్యండి అని నోరువిప్పి చెప్పలేనుగదా. అలాంటి స్థితిలో వాళ్ళని ఏం అనగలను? ఆ విషయమేగాదు ఏదన్నా సరే యిలాగే గడుసుగా వాళ్ళలో వాళ్ళు అనుకున్నట్లు అంటూ నామీద ప్రేమకురిపిస్తూ మాట్లాడుతారు అందరూ. బజార్లకి వెళ్ళి ఎవరికి కావల్సిన చీరలు వాళ్ళు కొనుక్కుం టారు. నాకు బజారుకి వెళ్ళే తీరికా వుండేదికాదు. వీలూ వుండేది కాదు. నాకు తేలేదేంఅంటే "అమ్మో పెద్దతారవి, నీకు మేం తెస్తే నచ్చుతాయా" అంటూతప్పించుకునేవారు. అన్ని విషయాలలో ఇంతే! ఇంటిలో శుభ్రంగా చీరలు కట్టుకు సింగారించుకోడం, రేడియోలు వింటూ, పేకాటలు ఆడుకుంటూ సరదాగా కాలక్షేపం చెయ్యడం వాళ్ళపని. వాళ్ళందరికోసం రాత్రింబగళ్ళు చెమటోడ్చి సంపాదించడం నా పని. ఒకోసారి నాకు ఉక్రోషం, కోపం వచ్చేది. కాని

ఎవరిమీద చూపాలో తెలిసేది కాదు. పైకి అంతా ఎంతో ప్రేమగా నటిస్తూ మాట్లాడే వారిని గట్టిగా ఏమనలేకపోయే దాన్ని.

"పోనీ యిదంతా సరే—వీళ్ళందరూ నాలాగే బీదరికం అనుభవించినవారు. చీరలు, నగలు మోజు పడుతున్నారు. ఇన్నాళ్ళకి నా వాళ్ళందరూ నావల్ల సుఖంగా బ్రతుకుతున్నారు అని గర్వపడేదాన్ని. ఇంతమందిని ఆదుకుంటున్నానన్న సంతృప్తి పడేదాన్ని. కాని నా డబ్బుతింటున్న ఇందరిలో ఏ ఒక్కరికీ ఆ కృతజ్ఞత లేదే. విశ్వాసంలేదే అన్నది నా బాధ !

"అంతలా నమ్మిన అన్నయ్య నాడబ్బంతా మాయం చేస్తున్నాడన్న నిజంకూడా ఎంత కాలమో గ్రహించ లేకపోయాను. సారధీ -యింతపెద్ద తారని, యింత డిమాండ్ వున్న నటిని-నా బ్యాంక్ బాలన్స ఎంతో తెలుసా !...?"

సారధి కుతూహలంగా చెప్పమన్నట్లు చూశాడు. "పన్నెండు వేలు" అంది తార. సారధి ఆశ్చర్యంగా "పన్నెండు వేలు. ఇంతేనా.! లక్ష రూపాయల రేటు నటివి, నాలుగైదేళ్ళుగా నీవు లేని పిక్చరులేదు. ఇంతేనా నీ దగ్గిరున్న డబ్బు..." అడిగాడు.

"అదేగా నా బాధ. అన్నయ్య ఏం చేస్తున్నాడో మొదట్లో తెలిసేదికాదు. ఆ తర్వాత ఇంటిలో అందరూ ఒకరి మీద ఒకరు చెప్పే నేరాలని బట్టి అన్నయ్య సగానికి సగం డబ్బు సంగ్రహిస్తున్నాడని, ఇంటిలో ఇంకెవరూ నోరెత్తకుండా అందరికీ తలో కాస్త పారేస్తున్నాడని అర్థం

అయింది. అసలు ప్రొడ్యూసర్ల దగ్గిర అగ్రిమెంటులో పుచ్చుకునేదానిలో సగం రాయించి మిగతాది బ్లాకులో తీసుకుంటున్నాడన్నది, ఆ తీసుకుంటున్నదంతా తను దాస్తున్నాడని ఇంటిలో వాళ్ళు చెప్పేవరకు నాకు అర్థంగాలేదు. అర్థమయ్యాక ఒకరోజు అన్నయ్యని అడగాలనుకుని కాస్త బెదురుగానే పిక్చరుకి ఎంత పుచ్చుకుంటున్నావనీ, మిగుళ్ళు, తగుళ్ళు ఎంతుంటుంది చెప్పాలని అడిగాను. దానికి అన్నయ్య తనకేదో పెద్దఅవమానం జరిగిపోయినట్టు మొహం ఎర్రబరచుకుని-"ఎందుకలా అడుగుతున్నావు, నీ డబ్బు నేనేమైన తినేస్తున్నాననుకున్నావా, అసలు ఎకౌంట్లు అడగాల్సిన అవసరం ఏం వచ్చింది. నీకసలు లెక్కలు చూడాలన్న అనుమానం ఎందుకు వచ్చింది." అంటూ కోపంగా గట్టిగా అరవడం మొదలుపెట్టాడు. నేనుబిక్కచచ్చి పోయాను. ఇంటిలో అంతా చుట్టూచేరి ఏమిటేమిటని అడిగారు! "నాకు తెలుసు నీ ఒకరోజు నీవిలా అడుగుతావని, అన్నయ్యని నీ క్షేమం కోరి నేను చేసేదంతా మరిచి వీళ్ళమాటలు వాళ్ళమాటలు విని నన్నడుగుతావని నాకు తెలుసు- రాత్రింబగళ్ళు గుమస్తాగాడిలా నీ లెక్కలురాసి, నీ వెంట స్టూడియోలమ్మట-తిరిగి వీళ్ళని వాళ్ళని పట్టుకుని నీకు రావల్సినవన్నీ వసూలుచేసి గాడిద చాకిరీచేస్తే ఆఖరికి ఈ రోజు నన్ను లెక్కలు చూపమనే దాకావస్తావని తెలుసు- అందుకే ముందే జాగ్రత్తపడ్డాను. ఇదిగో చూసుకో లెక్కలు ప్రతీదమ్మిడీరాశాను." అంటూ విసవిస వెళ్ళి ఇంతింత లావు పుస్తకాలు తెచ్చిపడేశాడు. నాన్న, అమ్మ, అంతా అన్నయ్య పక్షంచేరి "ఏమి

టమ్మా, వాడు నీకన్నయ్య. నీ మంచికోసం వాడంత కష్ట పడుతున్నాడు. వాడ్ని అనుమానిస్తావా" అంటూ మెత్త మెత్తగా మందలించడం మొదలు పెట్టారు. అంతా తలో మాట అన్నారు. ఇంత గొడవ జరుగుతుందని ఎదురుచూడని నేను అంతా నాతప్పే అన్నట్టు మాట్లాడుతూంటే బెదిరి పోయాను.

"మీరూరుకోండి నాన్నా! నాకెందుకీ అనవసర ప్రయాస, దాని డబ్బు దాని లెక్కలు అవి అదే చూసు కుంటుంది. మనం తినేస్తున్నాం అన్న అనుమానం దాని కొచ్చింది" అంటూ బింకంగా మాట్లాడాడు.

"అదేమిటిరా. అదేదో మామూలుగా అడిగిందానికి ఇంతగొడవచేస్తావు. దానికి తెలియదా ఏమిటి నీ సంగతి, నీవేం పైవాడివా దాన్ని మోసం చెయ్యడానికి వూరికే అడి గిందికానీ, నీవు పెద్దవాడివి అన్నీ తెలిసినవాడివి దాంతో ఏమి టిరా" అంటూ అన్నయ్యని బ్రతిమిలాడి, వాడు విసిరేసిన తాళాలు తీసి యిచ్చి సర్ది చెప్పేశారు. నేనేం అనడానికివుంది యింక! ఆఖరికి నేను తెలుసుకోవాలన్న విషయం తెలుసు కోనేలేదు.

"నేను సినిమాకి లక్ష తీసుకుంటానని అందరూ అంటు న్నారు. గత నాలుగేళ్ళుగా నేను కనీసం ఏడాదికి ఎనిమిది సినిమాలలో నటిస్తున్నాను. ఏడాదికి ఎనిమిదిలక్షలచొప్పున నాలుగేళ్ళల్లో ఎంత సంపాదించి వుండాలో చూడు. సరే టాక్సులు, ఇంటిలో ఇంతమంది పడితింటున్న ఖర్చులు అన్నీ పోనీ ఖర్చయినా కనీసం ఓ రెండు మూడు లక్షలన్నా

వుండాలా కేష్. ఈ ఇల్లు నావంటిని వున్న నగలు మాత్రమే, నాకు మిగిలాయి ఇప్పటికి. మిగతా డబ్బంతా ఏమయిందో దేముడికెరిక. బావలు ఏదో బిజినెస్ అంటూ డబు పట్టికెళ్లారట ! అన్నయ్య నేనేమీ అనకుండానే ముందరికాళ్ళకి బంధంలా ఇంటిఖర్చులు నేనువినేట్టు ఏకరువు పెడుతూంటాడు. వచ్చిందానిలో సగం ఇన్‌కంటాక్స్‌కే పోతూందని వల్లిస్తాడు. యింట్లో ప్రతివాళ్ళు ఎంతెంత దూబరా చేస్తున్నారో చెప్తుంటాడు. అన్నీ చెప్తూ ఇంతసంపాదిస్తేమాత్రం ఏం, ఎంత చెట్టుకంత గాలి, స్టేటస్ మెన్‌టైన్ చెయ్యాలిగదా అంటూ ఆఖరికి బ్యాంకిలో పన్నెండు వేలుందన్నాడు మొన్న మొన్న-”

“ఘోరం—యింత మోసాన్ని ఎలా సహిస్తున్నావు. ఇంత అమాయకులెక్కడన్నా వుంటారా సుందరీ, వీళ్ళందరికి నీవు భయపడడమేమిటి, గట్టిగా దబాయించి ఎందుకు అడగవు. ఎదురు చెప్పిన వాళ్ళని యింటిలోంచి పొమ్మను.”

“అదే నా బలహీనత. అందరూ నన్ను మోసం చేస్తున్నారని తెల్సినా ఎవరినీ గట్టిగా ఏమనలేను. పైకి మంచిగా, నాతో ఎంతో ఆప్యాయంగా మాట్లాడేవాళ్ళని ఎవరి నేరం ఏమిటో స్పష్టంగా తెలియని నేను ఎవరిమీద ఏ నింద వేయను.”

“ప్చ్, నీవు లాభంలేదు సుందరీ. వీళ్ళందరి రోగం కుదర్చాలంటే నీవు వెంటనే పెళ్ళిచేసుకోవాలి. ఆ వచ్చే భర్త గట్టివాడయి పెత్తనం చేతిలోకి తీసుకుని వీళ్ళందరి పని పట్టించాలి... అంతవరకు నీవేం చెయ్యలేవనుకుంటాను.”

“ప్చ్, అది జరుగుతుందా.”

"ఎందుకు జరగదు...నీవు కావాలంటే అది కష్టం కాదు."

"నీ కర్థంకాదు నా బాధ సారథీ...చెప్పాగా, ఆ మనిషి నా డబ్బునిచూసి వచ్చేవాడయితే నా బాధలు మరింత ఎక్కువవుతాయి... అతనూ వీళ్ళందరిలాగే నన్ను జలగలా పీడిస్తాడేమోనని భయం."

"అయితే ఇలా బాధపడుతూనే వుంటావా, వీళ్ళందరిని యిలా భరిస్తూనే వుంటావా...?"

"మరేం చెయ్యను...నన్ను కోరే మనిషి వచ్చేవరకు, ఇంతమందిని పోషిస్తున్నానన్న తృప్తితో బ్రతుకుతూంటాను. యింట్లోంచి వీళ్ళందరిని పంపించి వంటరిగా వుండేకంటే యీ తృప్తే నయం అనిపిస్తూంటుంది ఒకసారి...ఎవరూలేని నాకు యీ డబ్బుండిమాత్రం ఏం చేస్తుంది ఒకోసారి! డబ్బంతా తిననీ...నాకు కావల్సింది ఇంత అభిమానం, ఆదరణ...అవే నాకు దొరకనివి అయ్యాయే అన్నది నా బాధ!..." విచలిత కంఠంతో అంతా చెప్పి గాఢంగా నిట్టూర్చింది తార.

"తారా... నీవు చాలా సుఖంగా వున్నావనుకున్నాను. కానీ నీలో ఇంత ఆవేదన దాగివుందనుకోలేదు... చేతులారా బాధని నెత్తిమీద రుద్దుకుంటున్న నీకు సానుభూతి చూపడంకంటె ఎవరేం చెయ్యగలరు..."

"ఎవరు చేసేదేముంది...ఏమిటో నా గమ్యంఏమిటో, నేనేం చెయ్యాలో నాకే తోచడంలేదు-సరే, ఎంతచెప్పినా నీవు చేయగలిగింది ఏం వుంది- పరిస్థితులని ఎదురీద గలిగే గుండెనిబ్బరం నాకు రానంతవరకు ఇలా బాధపడుతూనే

వుంటాను. సరే, వెళ్దాంపద- చాలా ఆలస్యం అయింది."
తార లేచినిల్చుని అంది.

*　　*　　*

"హేపీ, బర్త్‌డే టూ యూ..., హేపీ బర్తుడే టూయూ తారా." ఏకకంఠంతో అందరూ తారని అభినందిస్తూ చప్పట్లు చరిచారు.

ఆరోజు తార పుట్టినరోజు! ఆమె గార్డెనులో సాయంత్రం బ్రహ్మాండమైన పార్టీ జరుగుతూంది. ప్రొడ్యూసర్లు, డైరెక్టర్లు, తోటి నటీనటులు, పాతసినిమా మనుషులు, పాత్రికేయులు... అందరూ సినీ ప్రపంచానికి సంబంధించినవారే! గార్డెనులో టేబిళ్ళుపరచి, కుర్చీలు వేసారు. నలుగురయిదుగురు కలసి కూర్చున్నవాళ్ళు, గుంపులుగా నిల్చుని కబుర్లు చెప్పుకుంటున్నవాళ్ళు, తారనిఅభినందిస్తున్నవాళ్ళు, డ్రింకులు సప్లయ్‌చేస్తూ ఇటూ అటూ తిరిగే తెల్లబట్టల బేరరు—టేప్ రికార్డరు వినిపిస్తున్న సన్నాయి వాయిద్యం-పట్టుచీరల గలగలలు, సెంటు ఘుమఘుమలు— గ్లాసుల చప్పుళ్ళు—నవ్వులు, మాటలు వాతావరణం అంతా అట్టహాసంగా వుంది. గార్డెనులో చెట్లనిండా రంగు రంగుల బెలూన్లు, రంగురంగుల బలుబులు కట్టారు.

అందరి మధ్య ఒంటరిగా ఓ టేబిల్ ముందు కూర్చున్న సారధి చాలా ఒంటరిగా ఫీలవుతూ, క్రొత్తగా, బిడియంగా, ఆక్వర్డ్‌గా కూర్చున్నాడు కూల్‌డ్రింక్ తాగుతూ. అందరూ

సినిమా లోకానికి సంబంధించిన మనుష్యులు. తనొక్కడే అందరిమధ్య అతకనట్టు చాలా మామూలు... చాలాతక్కువ మనిషిలా కూర్చోడం అదోలా అన్పించింది సారథికి.

అందుకే అసలు రాకూడదనుకున్నాడు. రానన్నాడు. తార ఫోనుచేసి పిలిచినపుడు— "ఏమిటీ, రావూ — అదేమిటి ?" అంది తార ఫోనులో ఆశ్చర్యంగా.

"క్షమించు సుందరీ. నేనెందుకులెద్దూ. మీ సినిమా వాళ్ళందరూ వస్తారుగాబోలు. నాకెవరూ తెలియదు. నే నెవరికీ తెలియను. నాకు మొహమాటంగా వుంటుంది. కావ లిస్తే ఉదయం వచ్చి నీకు గ్రీటింగ్స్ చెప్పేసి వెళ్ళిపోతా." అన్నాడు.

"అదేం కుదరదు ఎవరూ తెలియకపోతే నీకేం. నేనూ తెలియనా, నేను లేనా. నీవు రాకపోతే నేను చాలా బాధ పడ్తాను. వాళ్ళందరిని పిలవడం, వాళ్ళందరూ రావడం, వెళ్ళడం అన్నదంతా ఓ ఫార్మాలిటీ. నేను మనస్ఫూర్తిగా రమ్మని పిలుస్తున్నది నిన్నొక్కడినే తెలుసునా. తక్కిన అందరికి కార్డ్సు వెళ్ళాయి. ప్రత్యేకం ఫోనుచేసి నేను పిలు స్తున్నది నిన్నే."

ఒక్క క్షణం సారథికి సంతోషంతోపాటు గర్వమూ కల్గింది. తార, ప్రఖ్యాత సినీ నటి అయిన తార తనని మాత్రమే ప్రత్యేకం పిలుస్తూంది !

"రాకూడదని ఏంలేదు. ఇన్‌ఫాక్ట్ వస్తే సినిమా ప్రపంచంలోని మనుషులందరినీ చూడవచ్చుని కోరికగానూ వుంది. కానీ—కానీ—"

"కానీలు ఇంక లేవు రావాల్సిందే. వస్తావు. టైముకి రాకపోతే కారిచ్చి డ్రైవర్ని పంపిస్తా. నీవు వచ్చేవరకు పార్టీ ఆరంభం అవదు అన్న సంగతి గుర్తించు" అంటూ మరో మాటకి అవకాశం ఈయకుండా ఫోను పెట్టేసింది తార.

సుందరి ప్రత్యేకాభిమానాన్ని గురించి ఓ ప్రక్క ఆనందిస్తున్నా... ఓ ప్రక్క ఏదో తెలియని సందేహం, సారథిని పట్టుకుంది. ఆమె అభిమానానికి అర్థాలు వెతకడం ఆరంభించాడు. ఆలోచించిన కొద్దీ ఏదో భయమూ కలగసాగింది సారథికి. తను... తనస్థితి... తార... ఆమె చుట్టూ ప్రపంచము. ఆమె అంతస్తులన్నీ గుర్తులో వుంచుకొని యీ పరిచయాన్ని కేవలం పరిచయంగా మాత్రమే వుంచాలిగాని అంతకుమించి పెరగనీయక పోవడం మంచిదేమోననిపించింది సారథికి. ఆ ఉద్దేశ్యంతోనే సుందరి ఇంటికి ఆతరువాత మళ్ళీ ఓ ఇరవై రోజులు వెళ్ళలేదు. తార ఓ రోజు ఫోనుచేసింది. ఏదో కారణం, సాకులు చెప్పాడు. అలా ఓ వారం గడిచాక ఓరోజు ఉదయం షూటింగ్‌కి వెళ్ళేముందు తార సారథి రూముకి వచ్చేసింది. అర్థాంతరంగా, హఠాత్తుగా పెద్ద కారులో, ప్రఖ్యాత నటీమణి బ్రహ్మచారి, వంటరి అయిన తన కొట్టులాంటి గదికి రావడంతో సారథి గాభరాపడి పోయాడు. "ఇదేమిటి... ఇదేమిటి. ఇలా వచ్చావు" అంటూ వున్న ఒక్క కుర్చీలో కూర్చోపెడుతూ సుందరిని ఆరాటంగా అడిగాడు.

తమరి దర్శనం కాకపోతే మరేంచేస్తాను రాక... మహమ్మద్ రాకపోతే మవృంటెనే వెళ్ళిందట అక్కడికి.

అలా-తమరు బెట్టుచేస్తున్నారుగదా, రాకేంచేస్తాను..."
బుంగమూతి పెట్టి అంది తార.

"అదికాదు, అదికాదు..."

"ఏదికాదు ?... నీవెందుకు రావడంలేదో చెప్పు ముందు ఎందుకు నన్ను ఎవాయిడ్ చేస్తున్నావు ?" హార్ట్ అయినట్టు ఆమెగొంతే చెప్పింది. సారథి జవాబు చెప్ప లేనట్టు చూపు మరల్చుకుని తలదించుకున్నాడు. "నిజంగా సారథీ, నీ కంపెనీలోనే నేను కాస్త హాయిగా ప్రశాం తంగా ఫీలవుతున్నాను. తక్కిన వాళ్ళందరి ముందు ఆ లైఫ్ ఏదో ఆర్టిఫిషల్‌గా అనిపిస్తుంది. ఎందుకో ఈ మధ్య మరీ దిగులుగా వుంటోంది. లోన్లీగా ఫీలవుతున్నాను. అలాంటి సమయంలో నీతో కాసేపు కబుర్లుచెపుతే హాయిగా వుంటుం దనిపిస్తుంది. నీవసలు రావడమే మానేసావు..." బాధగా అంది తార. సారథి చలించాడు ఆ విచలిత కంఠాన్ని విని.

"సారీ, సుందరీ. నా కంపెనీ నీకు నిజంగా సంతోషాన్ని స్తుందనుకొని నేను అస్తమానూ రావడానికి నీకు నాకు వున్న పరిచయం ఏపాటి అని మొహమాట పడ్తున్నాను. అందరూ, మీవాళ్ళు అందరూ ఏమనుకుంటారో నని..."

"నాన్సెన్స్... ఎవరేమనుకుంటారు ! అనుకుంటే నాకేం భయం? మా వాళ్ళు, హు...మావాళ్ళు నాగురించి అంతమాత్రం పట్టించుకుంటే ఇంకేం !" కోపంగా అందితార. "నీవు నన్ను ఇంకా అపరిచితురాలి క్రింద ట్రీట్ చేస్తున్నావు గాబోలు. కానీ నేనెప్పుడూ... ఇప్పుడూ నిన్ను మంచి మిత్రుడుగా, నాఆప్తుడివిగానే భావించాను. ఇప్పుడు పెద్దనటి

కథా నిలయం 788 శ్రీకాకుళం

వయ్యారీ నేనేదో మారిపోయాననుకుంటావు గాబోలు... నీమీద నాకున్న... నాకుండే భావం... ఎలా చెప్పను ?"

"థేంక్స్... థేంక్స్ సుందరీ... నిన్ను సరిగ్గా అర్థం చేసికోలేక పోయాను. క్షమించు. నా రాక, నా కంపెనీ నీకు ఆనందాన్నిస్తుందంటే తప్పక వీలున్నప్పుడల్లా వస్తూంటాను"

"ప్రామిస్" విలాసంగా చేయిచాపింది తార. కాస్త సందేహిస్తూ ఆమె చేతిలో చేయివేసాడు సారథి. ఆ వేసిన చేతిని ఒక్క-క్షణం అలా పట్టుకుని సారథి మొఖంలోకి చూసింది. ఆమె మొహం ఎందుకో ఎర్రబడినట్లనిపించింది సారథికి. నెమ్మదిగా చేయి తీసేసుకున్నాడు. తార చప్పున తెలివి తెచ్చుకున్నట్టు సర్దుకుని లేచి నిల్చుంది. "వస్తా స్టూడియోకి వెడుతూ వెడుతూ ఇలా వచ్చాను ఆలశ్యంఅయింది, అంతా ఎదురు చూస్తుంటారు." అంటూ గబగబ వెళ్ళిపోయింది.

"అదేమిటి మీరు రారేం... ఫలహారం తీసుకోరూ" అంటూ తార అన్నయ్యవచ్చి సారథిని పలకరించేసరికి ఆలోచనల మధ్యనించి తేరుకుని చుట్టూ చూశాడు. అందరూ టేబిళ్ళచుట్టూ చేరుతున్నారు. బుఫే పార్టీ- ప్లేట్లలోంచి ఎవరికి కావల్సినవి వాళ్లు తీసుకుంటున్నారు.

సారథి తార అన్నయ్యవెంట వెళ్ళాడు. అతను టేబిల్ దగ్గరికి తీసికెళ్ళి ఓ ప్లేటు అందించి మరోవైపు వెళ్ళిపోయాడు. కాస్త ఖాళీగా వున్న ఓ టేబిల్ వైపు నడిచాడు సారథి. ఏవో ఓ రెండు ఫలహారాలు పెట్టుకుని తన కుర్చీలోకి వచ్చి మళ్ళీ కూర్చున్నాడు. తార ఆ గుంపు మధ్య

ఎక్కడుందీ కనపడలేదు సారథికి— రాను మొర్రో అంటే బలవంతం చేసిన తారమీద కోపంవస్తూంది సారథికి. సారథి వచ్చేసరికి సగంమంది వచ్చివున్నారు. అందరిమధ్య కూర్చుని గలగల నవ్వుతూ ఏదో మాట్లాడుతున్న తార చాలా సేపటి వరకు సారథి ఎదురుగా వచ్చి నిల్చున్నా గుర్తించలేదు. అంతమంది అపరిచితులమధ్య, కొందరు సారథిని ఎవరన్నట్టు చూస్తూంటే సారథి ఇబ్బందిగా కాసేపు నిల్చున్నాడు.

తార ఆ రోజు మరీ ఆధునికంగా అలంకరించుకుంది. పల్చటి నైలాన్ ష్రుగ...పైన పల్చటి లూజు జుబ్బా...మరో పల్చటి వల్లెవాటు, అన్ని బట్టలువున్నా, తార అవయవ సౌష్టవాన్ని స్పష్టంగా చూపించే ఆ డ్రెస్సింగ్‌లో తారని చూడడానికి సారథి ఎందుకో ఇబ్బందిపడ్డాడు. హాయిగా, శుభ్రంగా చీర కట్టుకోకుండా ఈ బట్టలేమిటో అనుకున్నాడు. చాలా ఖరీదయిన రాళ్ళనగలు ఆమెవంటిని మెరుస్తున్నాయి. జుత్తు సిగ చుట్టకుండా బాబ్‌గా వదిలేసింది. ఆమె ప్రక్కన ఎన్నో పూల బుకేలు, పువ్వుల మాలలు, అందంగా రంగు కాగితాలలో రిబ్బను కట్టిన ప్రెజంటేషన్ పేకట్లు చాలా వున్నాయి. ప్రక్కన టేబిల్ మీద ఆ పెద్ద పెద్ద పేకట్ల మధ్య తన చేతిలో ప్యాకట్టు చూసుకుని సిగ్గుపడ్డాడు సారథి.

అసలు తారకి ఏ బహుమతి తీసుకువెళ్ళాలా అన్న ప్రశ్నకి జవాబు తట్టలేదు. తను ఎంత ఖర్చుపెట్టినా ఓ ఏభై మహా అయితే వందకంటే ఖర్చు పెట్టలేడు. వంద రూపాయలు పెట్టినా ఏమీరాదు మంచిది. ఎందరెందరో పెద్ద

వాళ్ళు, లక్షలార్జించేవాళ్ళు తెచ్చే ప్రెజంట్లముందు తన బహుమతి తార కంటికేం ఆనుతుంది. అసలు రానసడానికి ఇది ఒక కారణం, అయినా తప్పిందిగాదు. అక్కడికీ ఎంతో ఆలోచించి మంచి నిర్మల్ పెయింటింగ్ - రాధాకృష్ణులు ఒకరి వడిలో ఒకరు తన్మయులవుతున్నట్టు చిత్రించిన పెయింటింగ్ కొన్నాడు.

చాలాసేపు నిల్చుని మరి లాభంలేదని మరి కాస్త ముందుకు వెళ్ళి "సుందరీ !" అన్నాడు సారథి. తార అప్పుడు చూసింది "వచ్చావూ. నీకోసమే చూస్తున్నాను" అంటూ పలకరించింది. తనొచ్చి పదినిమిషాలయింది. యిప్పుడన్నా పిలిస్తే చూసింది. తన కోసమే చూస్తున్నానంటుంది. ఎంత అబద్ధం !

"మెనీ రిటర్న్స ఆఫ్ ది డే సుందరీ !" అంటూ చేతిలో ప్యాకట్టు అందించాడు. తార ఆ ప్యాకట్టు అందు కోక పూర్వమే ప్రక్కనే నిల్చున్న ఆమె ఆయా అది అందు కుని మిగతా బహుమతులన్నింటి ప్రక్కన పెట్టేసింది. "థాంక్స" అంది తార. "రా. ఇలా కూర్చో" అంటూ ఓ టేబిల్ ముందు కూర్చోపెట్టింది. ఇంతలోనే ఇద్దరు ముగ్గురు రావడం చూసి అటు వెళ్ళింది తార పలకరించడానికి.

ఎవరెవరో వస్తున్నారు. కొంతమంది నటీనటులని, డైరక్టర్లని, ప్లేబాక్ పాటగాళ్ళని గుర్తించగలుగుతున్నాడు సారథి. కొందరు తార భుజంచుట్టూ చెయ్యివేసి దగ్గరకి లాక్కుని అభినందిస్తున్నారు. ఆమె భుజాలు పట్టుకుని 'బర్తుడే గర్ల్' కిస్ అంటూ ఆమె నుదురు ముద్దుపెట్టు

కున్నారు మరికొందరు. ఆమె బుగ్గమీద పేట్ చేసి 'హేపీ బర్త్ డే' అంటూ విష్ చేస్తున్నారు మరికొందరు. ఆమె భుజం చుట్టూ చెయ్యివేసి ఫొటోగ్రాఫర్లకి పోజులిస్తున్నారు. ఫ్లాష్‌బల్బులు ఆగకుండా వెలుగుతున్నాయి. అందరిని నవ్వుతూ పలకరిస్తూంది. సుతారంగా నమస్కారంచేస్తూంది కొందరికి. 'ఇప్పుడా రావడం' అంటూ ముద్దు ముద్దుగా గునుస్తూంది మరికొందరిదగ్గిర. మరికొందరితో గలగల నవ్వుతూ హాస్యాలాడుతూంది. వాళ్ళని, వాళ్ళ మాటలని, వారి వేషభావలని ఆశ్చర్యంగా కాసేపు చూశాడు సారథి.

తార డ్రస్సింగు, ఆమె మాట్లాడే తీరు, ఆమె నవ్వే తీరు, అందరూ ఆమెతో తీసుకునే చనువు, ఆ మాటలుఅన్నీ ఎందుకో సారథికి నచ్చలేదు. ఏదో తెలియని భారంతో సారథి గుండెల్లో ములు గుచ్చుకున్నట్లనిపించింది. తార చాలా బిజీగా వుంది. తనతో ప్రత్యేకంగావచ్చి మాట్లాడే సూచన కనిపించలేదు. తను రాగానే అందరి మధ్యనించి లేచి ఆదరంగా, అట్టహాసంగా తనని ఆహ్వానించి, అందరికి నా డియరెస్టు ఫ్రెండ్ అంటూ పరిచయం చేస్తుందని, అందరూ తన వంక చూస్తే తను గర్వపడినట్లు తను వచ్చాక తన దగ్గిరే కూర్చుని మాట్లాడుతుందని, ఏవేవో ఆశించిన సారథికి ఆమె ధోరణి నిరుత్సాహం కల్గించింది. ఆ వాతావరణంలో ఉక్కిరి బిక్కిరి అయినట్లు, అంతమందిమధ్య తనొక్కడే వెలేసినట్లు ఫీలవుతూ- ఆ టేబిల్ దగ్గిర నించి లేచి దూరంగా వెళ్ళి కూర్చున్నాడు.

తార బర్తుడే కేక్, గుండె ఆకారంలో వున్న కేక్ కట్ చేసింది. అందరూ ఆమె చుట్టూ గుంపుగా చేరి చప్పట్లు కొట్టి "హేపీ బర్తుడే టూ తారా" అంటూ గొంతుకలిపి పాడి విష్ చేశారు. హీరో కిరణ్ చిన్న కేక్ ముక్క తీసి ఆమె నోటికి అందించాడు. నేనేం తీసిపోయానన్నట్టు హీరో శ్యాం కూడా ఓ ముక్క నోట్లో పెట్టాడు. నలుగురయిదుగురు అందించాక ఆమె చేయి అడ్డంపెట్టి 'ప్లీజ్' అంటూ వారించింది.

దూరంనించి అంతా గమనిస్తున్న సారథిమనసుకి కష్టం అనిపించింది. "వాళ్ళందరూ నాకేం అవరు, నీవే రావాలి. నిన్నే ప్రత్యేకం పిలుస్తున్నా"నన్న సుందరి- తను వచ్చినట్టు చూడలేదు. ఒక్కమాట మాట్లాడలేదు. కనీసం కేక్ కట్ చేస్తూ అన్నా తన కోసం చూడలేదు. ఆమె ఆప్తులన్నట్లు వాళ్ళంతా కేక్ తినిపిస్తుంటే నిన్ను చూస్తే ఎవరో ఆప్తుడిని చూసినట్టుంటుంది అన్న సుందరికి అప్పుడన్నా తను గుర్తు రాలేదు. తార తనసొత్తు అయినట్టు, ఆమెని ఎవరో తన నించి విడదీసినట్టు సారథికి అసూయగావుంది. తారమీద కోపం వస్తూంది.

ఫలహారాలు చేస్తున్న అందరిమధ్య తిరుగుతూ అందరినీ పలకరిస్తున్న తార సారథి టేబిల్ దగ్గిరకి వచ్చింది... "అదేం, ఇక్కడ కూర్చున్నావు... అన్నీ తీసుకున్నావా ? నీకోసమే వెతుకుతున్నాను.. ఎక్కడ వున్నావా అని చూస్తున్నాను" అంది.

సారథి కసిగా, కఠినంగా ఏదో అనాలనుకునే లోపలే మరెవరో దగ్గరకి వచ్చి పలకరించారు. తార నవ్వుతూ వాళ్ళతో మాట్లాడుతూ కదిలి వెళ్ళిపోయింది.

ఆ తరువాత సారథి ఇంక ఎందుకో అక్కడ కూర్చో లేక పోయాడు. ఫలహారం ప్లేటు టేబిల్ మీద పెట్టేసి వెళ్ళిపోయాడు. అంతమంది మధ్య సారథి వెళ్ళడం ఎవరు పట్టించుకుంటారు! ఏదో అవమానం జరిగినట్టు, మొహం ఎర్ర బరుచుకుని విసవిస వెళ్ళిపోతున్న సారథిని తారచూడ లేదు.

* * *

మర్నాడు సారథి ఆఫీసునించి యింటికొచ్చేసరికి తార కారుడ్రైవరు సారథికోసం నిరీక్షిస్తూ కారులో కూర్చు న్నాడు సారథి గది ముందు. "అమ్మగారు మీరు రాగానే తీసుకురమ్మని పంపారండి" అన్నాడు వినయంగా. అసలే కోపంతో ఉడికిపోతున్న సారథికి మరింత వళ్ళు మండింది. ఏమిటో సుందరి ఉద్దేశ్యం! తనో వెర్రివెధవ అనుకుం టుందా? ఆవిడ పిలిచేసరికల్లా పరిగెత్తి వెళ్ళడానికి! ఆవిడ పెద్ద నటి, లక్షాధికారిణి అవచ్చు. కాని అంత ఆత్మాభి మానం చంపుకోవడానికి తనేం అంత పౌరుషంలేనివాడు కాడు! తనని ఆవిడగారు రమ్మన్నప్పుడల్లా వెళ్ళడం తప్ప మరో పని లేదనుకుందా! ఈరోజు నాలుగు డబ్బులు సంపాదించేసరికి ఎంత గర్వం! కసిగా అనుకుంటూ "పనుంది ఇప్పుడు రాలేనని చెప్పు" అన్నాడు వీలయినంత సౌమ్యంగా డ్రైవరుతో.

"అహా, అదేం కుదరదండి, రమన్నారండి, వస్తేగాని వీలులేదండి."

ఆఖరికి ఈ డ్రైవరుగాడికి కూడా లోకువయ్యాడా తను. అంతా వాడిష్టంలాగే వస్తేగాని కుదరదనడం వినేసరికి సారథి తిక్క మరింత రేగింది.

"నాకు పనుంది. రాను—రానన్నానని మీ అమ్మగారికి చెప్పు" అంటూ గదిలోకి వెళ్ళబోయాడు.

"మీరలా అన్నా వచ్చేవరకు వుండమన్నారండి, తీసుకురాకుండా రావద్దన్నారండి, మీరు రాకపోతే అమ్మ వస్తామని చెప్పమన్నారండి-" ఆపైన మీ ఇష్టం అన్నట్లు తను చెప్పవలసింది అయిపోయినట్లు సిగరెట్టు వెలిగించుకోడానికి తీసాడు జేబులోంచి.

సారథి కాస్త చల్లబడి "ఎందుకు... అంత అర్జంటు పనేమిటి ?" అన్నాడు.

"తెలియదండి, అమ్మగారింట్లోనే వున్నారండి, షూటింగ్ లేదు."

'సరే. ఈ డ్రైవరు మీద కోపం చూపిస్తే వాడేం చేస్తాడు! వెళ్ళి, సుందరినే ఈ తమాషా ఏమిటో అడిగేసేరి. తను వెళ్ళకపోతే నిజంగానే వస్తుందేమో... బాగుండదు...' ఆలోచించి మొహం అదీ కడుక్కుని బట్టలు మార్చుకుని బయలుదేరాడు సారథి.

సారథి వెళ్ళేసరికి, తార పడుకుని ఏవో పత్రికలు తిరగేస్తూంది. ప్రక్కమీద ట్రాన్సిస్టర్ నెమ్మదిగా పాటలు

వినిపిస్తూంది. సారథి డ్రాయింగు రూములోకి రాగానే "రా, లోపలికి పరవాలేదు" అంటూ ప్రక్కనించి లేచి కూర్చుంది.

"అవునూ. నిన్న ఎప్పుడు వెళ్ళిపోయావు ? చెప్ప కుండా చెయ్యకుండా వెళ్ళిపోవడమేనా ?"

"నేను వెళ్ళినా, మానినా, వున్నా.. నీకేం పరవా లేదని వెళ్ళిపోయాను" అక్కసుగా నిన్నటినించి మనసులో వున్న కోపాన్ని కసిగా వెళ్ళకక్కాడు.

"అదేమిటి ! అలా మాట్లాడుతున్నావు ?" హర్ట్ అయింది తార.

"నీవు చాలా బిజీగావున్నావు నాతో మాట్లాడగలిగే స్థితిలో లేవు. చెప్పి వెడదామన్నా నీవు అందరితో చాలా బిజీగా వున్నావు. నిన్ను డిస్టర్బ్ చేయడం ఎందుకని వెళ్ళి పోయాను." ఆ గొంతులో కఠినతని ఆ మొహంలో రంగుని తార తెల్లపోయి చూసింది.

"క్రొత్తగా మాట్లాడుతున్నావు ఏమిటి, కోపం వచ్చిందా ?" అంది కాసేపటికి ఆశ్చర్యంగా.

ఏం నటన? ఎంతయినా నటిగదా ! ఏం తెలియనట్టు, ఎంత అమాయకత నటిస్తూంది. "అందుకే అసలు రానన్నాను నాకు తెలుసు. నా అంతస్థు, నా తాహతు, పిలిచి పిలిచి వచ్చేవరకు ప్రాణాలు తీశావు. వాళ్ళలాంటి గొప్పవాళ్ళ ముందు నేను నీ కంటికి కనిపించనని తెలిసీ ఇంకా అక్కడే కూర్చోమన్నావా ? నీవు పెట్టే ఫలహారంకోసం వచ్చాననుకున్నావా ? సరే, అదయింది. రావడం నా బుద్ధితక్కువే. ఇప్పుడు ఎందుకు పిలిపించావు... ఏమిటి పని ? చెప్పు నేను

వెళ్ళాలి తొందరగా." కారులో కూడబలుక్కున్న మాటలని పాఠం అప్పచెప్పినట్లు గడగడ అనేసి, సీరియస్‌గా చూశాడు.

తార విస్తుపోతూ కాసేపు చూసి, తరువాత గలగల నవ్వి, ప్రక్క విరాదనించి లేచి, సారథి కూర్చున్న సోఫాలో ప్రక్కన కూర్చుంది. "అబ్బ, కోపంలో ఎంత బాగున్నావో తెలుసా !" చిలిపిగా అంది.

సారథి మొహం కోపంతో, సిగ్గుతో మరింత కందింది. 'చాలించు నీ నటన' అని అనాలనుకున్న మాటను తార మొహంచూస్తూ పైకి అనలేకపోయాడు. "నన్నెందుకు పిలి చావు. ఏమిటి పని ?" అన్నాడు దానికిబదులుగా సీరియస్‌గా.

"అదిసరే. యింతకీ తమరి ఈ అలక ఎందుకో నా కర్థంకాలేదు దేనికీ కోపం ?" సారథి కోపానికి బెదరనట్లు, నవ్వులాటక్రింద జమకట్టి మాట్లాడే తారని చూస్తుంటే సారథికి ఏమనాలో తోచలేదు. చటుక్కున నిల్చున్నాడు. "నేను వెడుతున్నాను. పనివుంది." రెండడుగులు వేసాడు. తార చటుక్కున లేచి "అరే రె... అయితే ఇదంతా నిజం కోపమే నన్నమాట." అంటూ చేయిపట్టుకుంది. సారథి తెల్లపోయాడు. తార అంత చనువు తీసుకుంటుందని అత నూహించలేదు. ఆమె పట్టుకున్న చేయివైపు చూసాడు. అది చూసినా తార అతని చేయి విడిచిపెట్టలేదు. అతని చేయి పట్టి లాగి, నడిపించి భుజంపట్టి సోఫాలో కూర్చో పెట్టింది. "అరె, ఏమిటా కోపం, చిన్నపిల్లాడిలా ఆ అలక ఏమిటి ? సరే, అసలు కోపం దేనికివచ్చిందో ముందు చెప్పు.

తరువాత ప్రతిమాలించుకొందువుగాని.” అతని ప్రక్కన కూర్చొని చనువుగా నవ్వి అంది.

ఆమె తీసుకుంటున్న చనువుకి, చొరవకి కాసేపు సారథి మాట్లాడలేకపోయాడు. తార అతని ఎర్రబడ్డ మొహాన్ని కాసేపు వింతగా, వినోదంగా చూసి, “నిన్న నీతో సరిగా మాట్లాడలేదనా కోపంవచ్చింది. బాగుంది, పార్టీలో, అందరిమధ్య నీ ఒక్కడితోనే మాట్లాడుతూ కూర్చుంటే అందరూ ఏమనుకుంటారు? గెస్టులందరిని పలకరించకుండా ఒక్క నీతోనే మాట్లాడితే బాగుంటుందా!”

“నాతో కూర్చోమనలేదు.. అసలు తిన్నగా పలకరించావా? ఒక్క నిమిషం అన్నా కూర్చున్నావా నాదగ్గిర, ఆఖరికి నేనేం బహుమతి తెచ్చానో అన్నా చూశావా. నీకోసం, కష్టపడి ఏంతెచ్చానో” చిన్నపిల్లాడిలా కంప్లైంట్ చేసాడు.

తార నవ్వుతూనే “అదిగో... అటు చూడు” అంటూ వేలితో చూపెట్టింది. అక్కడ రేడియో గ్రాం మీద నిన్న సారథి కొనితెచ్చిన నిర్మల్ పెయింటింగ్ వుంది. సారథి కళ్ళల్లో ఆశ్చర్యానందాలు మిళితమవుతూండగా తారవైపు చూశాడు. “అదిగో ఇప్పటికయినా నమ్మకం కుదిరిందా, నిన్ను నేనేం అలక్ష్యం చేయులేదని... వందలకొద్ది వచ్చిన బహుమతులలో ఇదొక్కటే ఈ గదిలోకి రాగలిగింది. తక్కినవి ఏమివచ్చాయో కూడా నేను చూడలేదు తెలుసా. ప్రత్యేకం అడిగి నీవిచ్చింది తీసుకు రమ్మన్నాను ఆయాని. నీకసలు అలాంటి అనుమానం ఎందుకువచ్చింది. నిన్నేదో నేను

ఇన్సల్ట్ చేసానని ఎలా అనుకోగలిగావు. నీకు తెలీదు. నీ మీద నాకెంత గౌరవం, సదభిప్రాయం వుందో నీకు తెలీదు. ఎలా చెపితే నీకర్థం అవుతుంది! ఎలా, ఏమని చెప్పాలి. నాకు తెలియడం లేదు."

సారథి తార చూపునించి తప్పించుకున్నాడు. ఏమనాలో తోచలేదు ఒక్క క్షణం. "పోయిందా కోపం ఇప్పటికైనా" కాసేపటికి తారే అంది. సారథి తలెత్తి ఆమె వంక చూసి చిన్నగ నవ్వాడు. "నాకేం కోపం? నీ మీద కోపగించడానికి నాకేం అధికారం వుంది!" గడుసుగా తప్పించుకుంటూ అన్నాడు. తార ఆశ్చర్యంగా చూసి "ఏం తెలివి? ఎంతయినా మగవాడివి? ఇప్పటివరకు అలిగి, ఇప్పుడు నాకేం కోపం అంటున్నావు? ఎంత గడుసుతనం? పొరపాటు వప్పుకోడం చిన్నతనంగాదూ, ఎప్పుడూ మీదే పై చెయ్యిగా వుండాలి కదూ. అవునా!"

"సర్లే. ఏదో అయింది. దీన్నే గాబోలు ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్ అంటారు ఇంగ్లీషులో" నవ్వాడు సారథి. "ఇంతకీ ఎందుకు పిలిచావు చెప్పు?"

"ఇందుకే, తమరికి కోపం వచ్చింది గదా, బ్రతిమిలాడుకుని ప్రసన్నుడిని చేసుకోవాలని..."

"నా కోపతాపాలతో నీకేం పని! ప్రఖ్యాత నటీమణివి. నాలాంటి ఆఫ్టరాల్ గాడ్ని ప్రసన్నం చేసుకోవలసిన అవసరం నీకేమిటి, నీ కృపావీక్షణాలకోసం నేను పాటు పడాలిగాని..." హాస్యంగా అన్నాడు.

"అలా అనుకోవడం లేదుగా నీవు." తార అలిగినట్లు మూతి బిగించి అంది. "అందుకే నీకులోకువయ్యానుగదూ...? అస్తమానూ నిన్ను రమ్మంటున్నానని, ఇది నా వెంట పడిం దని అనుకుంటున్నావు గాదూ!"

తన మనసులోనిది గ్రహించినట్లు తార అంటూంటే అబద్ధం అని ఖండించలేకపోయాడు సారథి. ఏం చెప్పాలో అని తడబడే లోపున "అమ్మగారూ భోజనానికి వస్తారా?" అంటూ తార ఆయా వచ్చింది లోపలికి. సారథి వాచి చూసుకున్నాడు ఎనిమిది దాటింది. లేచి నిల్చున్నాడు. "వస్తాను, నీకు భోజనం టైమైనట్టుంది."

"అదేమిటి వెళ్ళిపోతావా? బలే వాడివే... వెళ్ళి పోవడానికి పిలిచాననుకున్నావా ఏమిటి?"

"అస్తమానూ ఇదేమిటి సుందరీ, నన్నిలా మొహ మాట పెట్టడం బాగుందా!"

"మొహమాట పడమని ఎవడు చెప్పాడు నీకు, ఇంక పడడం మానేయి. చక్కగా భోంచేసి కాసేపు బీచిలో కూర్చుని, సెకండ్‌షో ఏదన్నా మంచి పిక్చర్‌కి వెడదాం.." ప్రోగ్రాం అంతా ఆలోచించే పెట్టింది తార అప్పటికే. ఇంకే మంటాడు సారథి. కాదనలేని బలహీనతకాక, మరేదో భావం కూడా అతన్ని వశపరచుకుంది.

ఆ రోజు భోజనం దగ్గర ఓ సీను జరిగిపోయింది. భోజనం బల్ల ముందు కూర్చుంటూనే పదార్థాలు చూసి "అబ్బ, ముల్లంగికూరా ఇవాళ! ఇంకేదన్నా చేసావా లేదా!

నా కోసం ?" అంది వంట అయ్యరుతో తారవిసుగ్గా. అతను శాంతబెరుకుగా "లేదండి." అన్నాడు.

"లేదూ, మరేం తింటా ననుకున్నావు. నాకీకూర సయించదని తెలియదూ. ఈ వెధవకూర చేయద్దని ఇది వరకు చెప్పానా లేదా ?" తార గొంతు తారస్థాయికి లేవడం ఆరంభించింది.

"నేనేం చెయ్యనండి, అక్కడికీ అమ్మగారికి చెప్పానండి మీరు తినరని పరవా లేదు అన్నారు."

ఈ లోపల తార తల్లి గబగబ లోపల్నించి వచ్చింది. 'ఏమిటే సుందూ' అంటూ. "అయ్యో నా మతి మండిపోనూ, ఈకూర నీవుతినవన్న సంగతే మరిచిపోయేనే తల్లీ" అంటూ సాగదీసింది.

"అమ్మగారీ కూర తినరని నే చెప్పానా లేదా మీకు, ఇదే వండమన్నారు. అమ్మ నన్ను తిడ్తున్నారు" తార ఏదో అనే లోపలే వంటవాడు కోపంగా ఆమె వైపు చూస్తూ అన్నాడు.

"అవ్వ...అవ్వ...నాకు చెప్పావా నీవు. ముసలిదాన్ని, మతిమరుపుదాన్ని గుర్తు డదు. పోనీ నీవు చెపితే ఎందుకు వండమంటాను. దానికోసం వేరే ఏదన్నా చేయించేదాన్ని కాదూ. ." ఆవిడ అయ్యరుని ఉరిమిచూసింది.

"ఇదిగో అమ్మా, పెద్దవారు అబద్ధాలాడ మాకండి. ఇందాక హాల్లో మీరు కూర్చుండగానే వచ్చి చెప్పలేదూ.

పరవాలేదు లెద్దూ ఒక పూటకి, అది పండేయి... అన లేదూ..."

"అయ్యయ్యో... చెప్పావా నాకు నీవు. ఎవరితో మాట్లాడుతూ, ఏది విన్నానో, ఏమనుకున్నానో. అమ్మాయి కోసం అంటే ఊరుకుంటానా?" ఆవిడ గబగబ అంది.

ఈ లోపల తండ్రి, అన్న, వదిన అందరూ చేరారు గదిలోకి ఏమిటేమిటంటూ. "ఒసేయ్. మీ కెవరికీ బుద్ధి లేదర్రా. అమ్మాయి సంగతి ఎవరికీ అక్కరలేదు. మీ మీ సుఖాలు తప్ప దానిసంగతి ఎవరూ పట్టించుకోరు." భార్యని తిట్టడం మొదలుపెట్టారు ఆయన. "అమ్మా, నీవు పెద్దదాని వయిపోయావు. మతిసరిగా లేకపోతే నీ కోడలుకి అప్పచెప్ప కూడదూ ఆ పెత్తనం. ఇంత మందిమీ ఇంట్లోపడి తింటూ దానికావలసినవి చూడక పోతే ఎలా. ఒసేయి, అలా మొద్దులా నిలబడి చూడకపోతే నాలుగు బంగాళా దుంప లన్నా తరిగి గబ గబ వేయించకూడదూ." భార్యని కేక వేశాడు అన్నగారు.

"బాగుంది. మధ్య నన్నంటా రేం. నా పెత్తనంఅయితే సుందరి కేం కావాలో కళ్ళల్లో వత్తులేసుకుచూసి అమర్చనూ" అంది మూతి తిప్పుకుంటూ వదినగారు.

"అనండర్రా అనండి. అదేదో నాకు సవితి కూతురు అయినట్టు నన్నే అనండి. అది నా కూతురు కాదూ, అది తినకపోతే నాకంటే మీ అందరికీ ఎక్కువ బాధా...కన్న కడుపు నాది. అయ్యారూ, ఏమిటలా నిలబడి చూస్తావు. గబ గబ మరేదన్నా నంగు."

"మరేం లేవు ఇంట్లో" అయ్యారు మొహం మటమట లాడించుకుంటూ అన్నాడు. తార నోరు తెరచి ఒక్క మాట మాట్లాడడానికి అవకాశం యీయకుండా ఇంతమంది, ఇన్ని మాటలు ఒక్క నిమిషంలో మాట్లాడేసారు. సారధి తెల్ల పోయి చూడసాగాడు. తార మొహం సిగ్గుతో, కోపంతో ఎఱ్ఱబడిపోయింది.

"ఏమీ లేవు—అదిగో అందుకే మరో కూర చెప్ప లేదు కాబోలు... ఇంతమంది నౌకర్లున్నారు. ఒక్కడూ వేళకి కనపడడు. సాయంత్రం కూరలు తెప్పిద్దామనుకున్నాను. ఎక్కడ చచ్చారో ఒకడూ కనపడితేనేనా" సుందరి తల్లి మళ్ళీ ఆరంభించింది.

"అమ్మా !... నీకో నమస్కారం. ఇంక వూరు కుంటావా ?... ఇదేం మొదటిసారి కాదు ఇలా జరగడం, నాకేం క్రొత్తకాదు అనవసరంగా నీవెందుకు హైరాన పడ తావు. ఇష్టం వుంటే తింటాను లేకపోతే పోతాను..." సుందరి కుర్చీ నెట్టి లేచి నిల్చుంది.

"అదేమిటమ్మా. వుండుండు... అయ్యో...కూర లేక పోతేనేం...సాంబారు అవీ వున్నాయి గదమ్మా, భోజనం ముందునించి లేచి వెళ్ళిపోకూడదమ్మా." తండ్రి.

"నేను తినేది ఒక కూరే నన్న సంగతి తెలియనట్లు మాట్లాడుతావేమిటి నాన్నా. రొట్టెలలోకి కూరకూడా లేకుండా ఎలా తింటాను—సారధీ—ఎక్స్క్యూజ్ మీ—పద.. అలా ఏ హోటలుకేనా వెళ్ళి భోంచేద్దాం— నిన్నుకూడా పిల్చాను అనవసరంగా— రా, వెడదాం— ఈ యింటి

భోజనంకంటె, డబ్బు పారేస్తే పది రకాలు క్షణాల్లో పెడ తాడు హోటలువాడు." "తారా !" సారథి ఏదో చెప్ప బోయాడు. తార విన్పించుకోకుండా విసవిస మేడమీాదికి వెళ్ళింది. సారథి ఏం చెయ్యాలో, ఏం అనాలో తెలియ కుండా లేచి హాల్లోకి వచ్చాడు. డైనింగు రూములో అందరూ గట్టిగా ఒకరిని ఒకరు నిందించుకుంటూ మాట్లాడు కుంటున్నారు. తార హేండ్ బ్యాగు కేసుతో దిగివచ్చి— "రా, సారథీ" అంది.

"నీవు తొందరపడ్డావు సుందరీ, ఒకపూట ఎలాగో సర్దుకుంటే పోయేదానికి యింతగొడవ ఎందుకు ?" కారులో కూర్చున్నాక, తార ఆవేశం కాస్త చల్లబడిందనిపించాక నెమ్మదిగా అన్నాడు.

"ఒక్క పూటా ? ఇలాంటి పూటలు ఎన్ని ఇదివరకు అయ్యాయో నీకేం తెలుసు ! ఇంట్లో వున్న అందరూ ఎవ రికి కావల్సినవి రకరకాలు చేయించుకోడం ఎవరూ మరిచి పోరు. ఒక్క నాకు కావల్సినవి చేయించడానికే అందరికీ మరువు. నాన్నకి కారం పడదు, చప్పిడి వంటలు, అమ్మకి షుగర్ గోధుమన్నం, వదినకి కారం కావాలి, అన్నయ్యకి మధ్యరకం, మరొకరికి వేపుళ్ళు యిష్టం, ఇంకోరికి ఆవకూర లిష్టం—ఇలా ప్రతీవాళ్ళూ ప్రతీపూట అరడజను పదార్థాలకి తక్కువ కాకుండా చేయించుకుంటారు— ఆ వంటవాళ్ళు ఏడుస్తారు ఇన్ని రకాలు చేయడానికి, వాళ్ళమీాద అథార్టీ చేయిస్తారు ఎంత డబ్బిచ్చినా యిన్నేసి రకాలు ఎవరు చేస్తారు. అస్తమానూ వాళ్ళు మానేస్తుంటారు. అప్పుడు

యింతమంది వున్నా ఒక్కరూ ఒకపూట వండరు తెలుసా.. సరే, పోనీ ఎవరికి కావల్సినవి వాళ్ళని చేయించుకోవద్దని అనలేదు, నాకు కావల్సినవి ఆపాటి చూడకూడదా అన్నదే నాబాధ— చూశావుగా ఇంట్లో రాద్ధాంతం, ప్రతి విషయానికీ ఇలాగే జరుగుతుంది సీను— ఆఖరికి మళ్ళీ మామూలే రేపటినించి... ఇదేం మొదటిసారిగాదు నాకీ అనుభవం!.." తార కసిగా అంది. సుందరి ఇదివరకు చెప్పినట్టే జరగడం కళ్ళారా చూశాక తారదే తప్పనలేకపోయాడు సారథి.

హోటలు "దాసప్రకాష్" లోకి కారు పోనిచ్చింది తార. హోటలంతా దేదీప్యమానంగా వెలిగిపోతూంది. తార కారుదిగి లోపలికి అడుగు పెడుతూండగానే మేనేజర్ సమంభ్రమంగా లేచి ఎదురొచ్చి నమస్కారం చేసి లోపలికి ఆహ్వానించాడు. "రూఫ్ గార్డెన్ లో టేబిలు ఎరేంజ్ చేయించండి.. ఎవరూ లేకుండా వుండేచోటుంటే మంచిది" అంది తార. చకచక ఆమె ఆజ్ఞ పాటించడానికి ఆర్డరు వెళ్ళింది. మేనేజరు వినయంగా మాటలాడుతూనే పైకి తీసికెళ్ళాడు.

ఎవరో రెండుమూడు టేబిళ్ళని ఆక్రమించుకుని కూర్చుని వున్నారు భోజనాలు చేస్తూ. "వారంతా వచ్చి చాలా సేపయింది. వెళ్లిపోతారు. ఇక్కడ కూర్చోండి మీకేం ఇబ్బంది వుండదు." అన్నాడు మేనేజర్. సర్వర్లు చకచక టేబిల్ అమర్చారు. ఒక్కొక్కటి సర్వ్ చేయడం ఆరంభించారు. "అన్నీ తీసుకొచ్చి పెట్టేయండి ఒకసారే, మీరు వెళ్ళండి. పాపం మీకు పనుండదూ! నాకింకేం అక్కర

లేదు లెండి" అంది తార. మేనేజరు మరోసారి నమస్కారం చేసి వెళ్ళిపోయాడు. సర్వర్లు దూరంగా వెళ్ళిపోయారు

"అమ్మయ్య, ఇంక హాయిగా భోంచేద్దాం... ఊఁ... ఆరంభించు ఇంటి కంటె గుడి పదిలమది. చూశావా, డబ్బు పారేస్తే ఎన్నిరకాలు అమర్చారో. ఇక్కడ డిషెస్ కూడా బాగుంటాయి. ఎప్పుడన్నా ఇలా ఇక్కడికే వస్తుంటాను నేను. మేనేజరు మంచివాడు. నే రాగానే స్పెషల్‌గా మరిన్ని వడ్డిస్తాడు. ఇన్నిరకాలు మనం ఎక్కడతినగలం." భోంచేస్తూ తార మాట్లాడుతూనే వుంది. తార వెంటవున్న తనని మేనేజరు ఎలా ఎగాదిగా ఎవరీ కొత్తపిట్ట అన్నట్టు చూసినట్టు, దూరంగా సర్వరు తమ వేపేచూసి నవ్వుకుంటూ మాట్లాడుకుంటున్నట్లు అనిపించింది సారథికి "ఒక్కర్తివేవస్తూంటావా ఇక్కడికి ఫ్రెండ్సుతో వస్తావా" అన్నాడు సారథి.

"ఏమో, ఎవరన్నా ఆ వేళకి వెంటవుంటే సరే, లేకపోతే ఒక్కర్తినే. సాధారణంగా ఒక్కర్తినే వస్తాను.. ఏం ?"

"ఏంలేదు. వూరికే అడిగాను." అందుకే గాబోలు ఈ రోజు అందరూ తననిఅలాచూస్తున్నారు కుతూహలంగా! 'ఫలానా తార ఇంట్లో తరుచు కనిపించే ఆ యువకుడు ఎవరు ?' అంటూ క్వశ్చన్ మార్కులు సినిమా పత్రికలు కురిపిస్తాయిగాబోలు; తారవెంట వెళ్ళి పత్రికలలో తన పేరు ఎక్కినందుకు గర్వించాలా ! సిగ్గుపడాలా ?

"ఏమిటి ఆలోచిస్తున్నావు ?"

"ఏంలేదు." అన్నాడు సారథి. తను మరీఅనవసరంగా ఎక్కువ ఆలోచిస్తున్నాడు!

భోంచేశాక ఓఅరగంట బీచ్‌లో కూర్చున్నాక, "సినిమాకి వెడదామా! 'సోనేకి చిడియా' అని హిందీ పిక్చరు. పాతదే అనుకో. నేను చూడలేదు. ఆ పిక్చరు ఓ సినీతార కథేట. నూతన్ చాలా బాగా ఏక్ట్ చేసిందిట." అంది తార. సారథీ చూడలేదు.

"పద. సినిమా అంటే ఎప్పుడూ రెడీయే మనం" సారథి లేచి నిల్చున్నాడు.

ఆ సినిమా చూస్తున్నంత సేపూ! "చూశావా... చూశావా...అచ్చు నా కథలాగే లేదూ. చూశావా-డబ్బుకోసం తల్లిదండ్రులు, అన్నదమ్ములు సయితం ఎలా మారిపోతారో చూశావా, నే చెపితే నమ్మావా? చూశావా, ప్రేమించాను, ప్రేమించాను అన్నవాడు కూడా ఆతార డబ్బులేదు అనగానే ఎలాతప్పుకున్నాడో చూశావా! నే చెప్పలేదూ. ఎవరన్నా నన్ను పెళ్ళిచేసుకుంటే డబ్బుకోసమే అని చెప్పానా లేదా. అబ్బ! ఎంత బాగుంది ఈ సినిమా. నా కథే తీసినట్టున్నారు." అంటూ ఎక్సైటెట్ అయిపోతూ తార మాట్లాడుతూనే వుంది. కళ్ళ నీళ్ళు తుడుచుకుంది మధ్య మధ్య.

"ఇంకా నా కథ కొంత నయమే. కొట్టేంతవరకు రాలేదు మావాళ్లు, ఏమో అదీ జరుగుతుందేమో! అలా నా జీవితంలోకి, నన్ను నన్నుగా ప్రేమించే మనిషి ఎప్పటికన్నా వస్తాడంటావా?" సినిమా జరుగుతున్నంతసేపూ

ఎమోషనల్‌గా మాట్లాడుతూనేవుంది తార. ఆ సినీ నాయిక కథకి సారథి కూడా చలించాడు. "వండర్‌ఫుల్ పిక్చర్, చాలా బాగుంది కదూ" అన్నాడు.

"నెమ్మదిగా అంటావేమిటి, హేట్స్ ఆఫ్ టూ నూతన్. నిజంగా యిలా జరుగబట్టే కదా సినిమా వచ్చిందీ. నాలాంటి వాళ్లు కొందరన్నా ఇంకా నాతోడు వున్నారంటే నాకేదో ఓదార్పు అన్పిస్తూంది." అంది కారులో తార నవ్వుతూ.

"చాలా బాగా గడిచింది ఈ సాయంత్రం. అప్పుడప్పుడు ఇలా తిరిగి వస్తూందాం ఏం ?" అంది తార సారథిని డ్రాప్ చేస్తూ.

"ష్యూర్" అన్నాడు సారథి.

ఆ తరువాత సారథి, తార చాలా సాయంత్రాలు, రాత్రిళ్ళు - అనుకున్నట్టే సినిమాలకి, షికార్లకి, బీచ్‌కి, హోటళ్ళకి తిరిగారు. తార వెంట వీలున్నప్పుడల్లా షూటింగులకికూడా వెడుతుండేవాడు సారథి... ఆరు నెలల్లో తార సారథి చాలా సన్నిహితులైనారు. రోజులు చాలా తొందరగా గడిచిపోతున్నాయి నీవువచ్చాక అనేది తార. తారతో పరిచయం అయ్యాక ఆమె వెట సినిమాలకి, పార్టీలకి, పిక్చరు ప్రీవ్యూలకి వెడుతూండడం బాగానే వుందనిపించింది సారథికి. క్రొత్త క్రొత్త మొహాలు, క్రొత్త క్రొత్త పరిచయాలు, తను చూడలేని, తనబోటివాడికి అందని స్థలాలు, మనుష్యుల మధ్య తిరగడం ఓ వింత అనుభవంలా అన్పించింది. తార వెంట వున్న సారథికి ఆమెతో పాటు మర్యా

దలు ముట్టేవి. ఎవరెలా అనుకున్నా వెనకగాని, మొహం ముందు ఎవరూ అనరు గదా !

తారతో తిరుగుతూంటే సారధికి మిత్రులమధ్య, ఆఫీసులో పరపతి, గౌరవం ఎక్కువయ్యాయి. అంత ప్రముఖ నటితో తిరిగే అతని అదృష్టానికి అసూయపడే వారు కొందరు, అభినందించేవారు. మా కొకసారి ఆమెని చూపించవా అనికూడా అడిగేవారు. నటిగా ఆమెని అభి నందిస్తూ మాట్లాడే వారందరూ కూడా వ్యక్తిగా ఆమెని గురించి రకరకాలుగా మాట్లాడుతూంటే... గౌరవం యివాయ కుండా అది, ఇది అంటూ చర్చిస్తూంటే అలాంటప్పుడు అనేవాళ్ళని ఏమనలేక, అవి వినలేక బాధపడేవాడు సారధి. ఆమెగురించి అలా మాట్లాడే అందరూ, తన వెనక -ఆమెతో తిరిగే తన గురించి నీచంగా హేళనగా మాట్లాడుతారేమో ననిపించేది. ఏమయినా తార కంపెనీ, తార స్నేహం వదులుకోడం - దూరంచేసుకోలేని బలహీనతో, బంధమో అతన్ని కట్టేసింది. తార గ్లామర్‌కి, అతనూ లోబడ్డాడని చెప్పకతప్పదు.

అత నూహించినట్టే సినీపత్రికలలో — పేరు చెప్ప కుండా ప్రఖ్యాత నటీమణి కాబోయే భర్తెవరో తెలుసా, ఫలాన ఎవరో తారతో తిరిగే అతనికీ ఆమెకి సంబంధం ఏమిటి ? ... ఓ ప్రముఖ నటీమణి విహారాలు- మొదలైన ప్రశ్నార్థకాల శీర్షికలు, మీకు తెలుసా అంటూ వార్తలు పత్రికలలో పడడం ఆరంభించాయి. కొన్ని పత్రికలయితే

పబ్లిక్‌గానే 'నయనతార పెళ్ళిభోజనం త్వరలోనే తినచ్చు. వివాహం అయ్యాక నటిస్తుందా, మానేస్తుందా...' అంటూ వ్యాఖ్యానించేవి.

ఆ ఫలానా తార ఎవరో, ఆమెతో తిరిగేది తనేనని సారథికి ఆ పత్రికలలో వార్తలు తెలిసేసరికి కొన్నాళ్ళు పట్టింది. ఫ్రెండ్స్ అందరూ హాస్యాలు, వేళాకోళాలు ఆరంభించాక స్పష్టంగా తెల్సింది. తెలిశాక సిగ్గు, అభిమానం, ఎవరిమీద చూపించాలో తెలియనికోపం అన్నీ కలిసి సారథి మనశ్శాంతిని హరించాయి.

ఆరోజు తార ఇంటికి వెళ్ళినప్పుడు "చూశావా... పత్రికలలో ఎలా రాస్తున్నారో ... మనగురించేగదూ..." అనడిగాడు. తార అవన్నీ చదువుతూందో లేదో, చదివితే అంత నిర్వికారంగా ఎలా వుండగలుగుతుందో అర్థంకాలేదు సారథికి. మగాడు తనకే ఆ వార్తలు ఇంత అలజడి కలిగించాయి కదా తార బాధ పడడంలేదా! ఆమెకి తెలియదేమో! చదవలేదేమో! అన్న అనుమానంతో ఆ ప్రసక్తి కావాలనే తెచ్చాడు సారథి.

తార నిర్లక్ష్యంగా నవ్వింది ... "ప్చ్, రాయనీ ... రాసుకుంటారు అంతకంటే మననేం చేస్తారు ?" అంది అతి మామూలుగా. సారథి తెల్లపోయి చూశాడు.

"ఇలాంటి మాటలన్నీ లెక్కచేస్తే అయినట్టే. రోజూకి లక్షాతొంభై వార్తలు రాస్తూంటారు మా గురించి. ఇదిగో పులంటే అదిగో తోక అనేసి, అసలు వున్నదానికి పోలిక లేని వార్తలు వెలువరిస్తాయి ఈ పత్రికలు. తమ పత్రికలు

అమ్ముకోడానికి ఏవో ఇలాంటి వేడి వేడి తాజావార్తలు ప్రచురిస్తానే వుంటారు. ఎన్నని పట్టించుకుంటాం మేం, ఎన్నింటికని బాధపడగలం? ... అలవాటయిపోతుంది ఇలాంటివన్నీ చదవడం -" నవ్వుతూ అంది తార.

నిజమే. ఇప్పుడు ఇన్వాల్వ్ అయింది తను గాబట్టి బాధ పడుతున్నాడు కాని, ఇదివరకు తనూ ఇలాంటి వార్తలు ఇంట రెస్టింగ్‌గా చదివినవాడే ... ఫ్రెండ్స్ మధ్య తారలగురించి చర్చించినవాడే! ఫలానా తార ఎవరితో తిరుగుతుందో, ఏ ఏ తార ప్రియులెవరో, వారి ప్రణయగాథలు, వగైరాలు అన్నీ చాలాసార్లు చదివాడు. అంతదాకా ఎందుకు - యీ నయనతార గురించీ చదివినట్టే గుర్తు. ఇందులో నిజానిజాలు ఎంతో ఆ భగవంతుడికే తెలియాలి?

"ఎవరితోనన్నా ఏ సినిమాలోనో, ఏ హోటలు లోనో టిఫిను తింటూ కనిపించినా, ఎవరి కారులో కని పించినా, ఏ హీరోతో కాస్త సరదాగా నవ్వుతూ మాట్లా డినా, ఊహాగానాలు చేసి రాసేస్తూంటారు. అలాంటిది మనం ఇద్దరం క్లోజ్‌గా షికార్లు, సినిమాలు తిరుగుతున్నాం-అలాం టప్పుడు రాయకుండా వుంటారా..." తారే అంది మళ్ళీ, అదోలావున్న సారథి మొహం చూస్తూ "ఎందుకలా ఏదో కొంప మునిగినట్టు మొహం పెట్టావు ... ఇవన్నీ లెక్క చేస్తు న్నావా? బాధపడుతున్నావా...?"

సారథికి ఏం అనాలో అర్థంకాలేదు. "నీ పేరు రాయ లేదుగా ... నీవేనని ఎవరికీ తెలియదులే భయపడకు."

"తెలియకపోవడం ఏమిటి ... ఆఫీసులో, వూర్లో ఫ్రెండ్స్ అందరికీ తెలుసు." ఎర్రబడ్డ మొహంతో అన్నాడు సారథి.

"అయితే ఏమిటంటావు ? ... చిన్నతనంగావుందా, నాతో తిరిగి చెడ్డపేరు తెచ్చుకున్నావని బాధపడ్తున్నావా?" తార అతనివంక పట్టి పట్టి చూస్తూ అంది.

సారథి జవాబు చెప్పలేకపోయాడు "మొగాడివి, నీకెందుకో యీ బాధ ... ఏం ఇలాంటిదానితో తిరిగితే పెళ్ళిగాదని భయమా ఏమిటి ? ... బెంగెట్టుకోకు అంతగా నీకు పెళ్ళిగాకపోతే నేను చూస్తూ వూరుకోనులే..." హాస్యంగా అంది. సారథి మొహం మరింత కందింది ఆ హాస్యానికి.

ఆ పూట ఎందుకో ఎప్పటిలా సరదాగా తారతో మాట్లాడలేకపోయాడు. ఆమె ఛలోక్తులని ఆనందించలేక పోయాడు. అలా ఓ గంట కూర్చుని రూముకి వచ్చేసాడు తార ఎంత ఆపినా ఆగకుండా.

నెలరోజులు గడిచాయి. ఆనెలా తార దగ్గరికి వెళ్లలేదు సారథి. వెళ్ళకుండా వుండటానికి చాలా ప్రయత్నం చేసా డనే చెప్పాలి. ఎందుచేతో తారకూడా ఓ పదిహేనురోజులు ఫోన్ చెయ్యలేదు. తర్వాత ఫోనుచేసింది 'రావడంలేదేం' అంటూ. ఏవేవో కుంటిసాకులు చెప్పి తప్పించుకున్నాడు సారథి. వస్తానని రెండుసార్లు చెప్పి వెళ్ళడం మానేసాడు. అలా ఒక నెల గడిచిపోయింది.

అసలు తారని తనెందుకు తప్పించుకుంటున్నాడో తనకే అర్థంకాలేదు సారథికి. అసలు తారపట్ల తన కేభావం వుందో కూడా ఇన్నాళ్ళు గడిచినా సారథికే అంతుబట్టలేదు. తార మీాద తనభావం తనకే అర్థంకాకపోయినా తనమీాద తారకి ఏం భావంవుందో చాలా సందర్భాలలో గ్రహించగలిగాడు సారథి. అందుకే వెళ్ళడం మానేయాలనే నిర్ణయానికి వచ్చాడు సారథి.

తార...తనని ప్రేమిస్తూందా! తనని కోరుతూందా! అందుకేనా తనని రమ్మనడం? అందుకేనా తనని ఆహ్వానించడం? తార చనువులో అర్థం ఇదేనా? ఏం లేకపోతే తనమీాద ప్రత్యేకాభిమానం ఎందుకు చూపుతుంది? ఇంత మందివుండగా, ఎంతెంతమందో ఆమెకోసం ఆరాటపడే వాళ్ళుంటారు- వాళ్ళందరిమీాద లేని ప్రత్యేక ఇంటరెస్ట్‌కి అర్థం ఏమిటి? తనకోసం ఫోన్లమీాద ఫోన్లు చెయ్యడం, రాకపోతే కార్లు పంపుతూండటం, తనురాగానే ఆమెముఖం వికసించడం. కళ్ళలో వెలుగుకి అర్థం ఏమిటి? తననికార్లలో ఎందుకు త్రిప్పుతూంది, తన కంపెనీ ఎందుకు కోరుతూంది! నిన్ను చూస్తే ఎవరో ఆప్తుడిని చూసినట్టు వుంటుందని పదే పదే ఎందుకు అంటుంది! తనతో ఎన్నిసార్లు హాస్యాని కన్నట్టే అంటూ పెళ్ళి ప్రసక్తి ఎందుకు తెస్తుంది!?

"పెళ్ళిచేసుకోవా ఏమిటి. ఏం, అమ్మాయి ఎవరూ దొరకలేదూ— ఎవరూ లేకపోతే అక్క మొగుడే గతి అన్నారు. అలా నేనున్నాలే భయపడకు. సారథీ.. నీ కాబోయే భార్య ఎలా వుండాలనుకుంటున్నావు! అందానికి

ప్రాముఖ్యం ఇస్తావా, డబ్బుకా, మనసుకా నీకేం కావాలి? పెళ్ళిచేసుకో సారథీ. బెండకాయ ముదిరినా బ్రహ్మచారి ముదిరినా పనికిరాదు..సారథీ ఒకటడుగుతాను చెపుతావా. ఆరోజు...అదే సుందరిగా నీ దగ్గిరకు వచ్చి పెళ్ళిచేసుకోమని అడిగినరోజున ఏమనుకున్నావు ?... ఒకవేళ ఇప్పుడు తారగా అదే ప్రశ్న అడుగుతాననుకో...ఆహా..అనుకో-అనుకో సర దాకి. అబ్బ వూరికే అడుగుతున్నాను- ఏం జవాబు చెపు తావు... అదే చెపుతావా ?"

ఇలాంటి మాటలు, ప్రశ్నలు ఎన్నోసార్లు ఎందుకు వేస్తుంది. జవాబు చెప్పలేక తడబడే తనని మళ్ళీ హాస్యాని కన్నానులే అనీ నవ్వే తారనిగురించి ఏమనుకోవాలి ?ఇంట్లో గొడవలు, ఇంటి రహస్యాలు, తన ఆవేదనలు, తన బాధలు అన్నీ ఎందుకు విప్పి చెపుతూంది తనతో ! డబ్బుకోసం చూడక తనని తనుగా ప్రేమించే మనిషికోసం చూసున్నా నని చెప్పిందే. ఎందుకు తనతో చెప్పడం? తన ప్రక్కన కూర్చున్నప్పుడు కారులో, సినిమాలో ఎన్నెన్నిసార్లో తనని కావాలని తాకుతూండటం కనిపెట్టలేనంత అమాయకుడు కాదు తను ! తనకోసం ప్రత్యేకంగా అలంకరించుకోడం, తనని కొంటెగా కవ్విస్తూ చూడడంలాంటి వాటికి అర్థాలు తెలుసుకోలేనంత మూర్ఖుడా తను ! ఇవన్నీ ఏంచెప్తు న్నాయి—తనని తార ప్రేమిస్తూందని తెలియజెప్పడం లేదూ -

పదేపదే యీ ప్రశ్నలు, సందేహాలు వచ్చేవి సార థికి. అయితే ఇవన్నీ అనుమానాలు తప్ప స్పష్టంగా తార

ప్పుడూ తనని అడగలేదు. అడిగితే తనేం జవాబు చెప్తాడో, చెప్పాలో కూడా సారథికి తెలియడంలేదు. తార అంటే ఏదో అభిమానం వుంది. ఆమెతో తిరగడం, ఆమె కంపెనీతో బాగానే టైము గడిచిపోతూంది అన్నభావం, ఆమె గ్లామరుకి ఆకర్షితుడవడం-వీటిని ప్రేమ అంటారా? కాదు.... అన్నది సారథికి తెలుస్తుంది.

తారతో తిరుగుతున్నా తార కావాలని, ఆమెని చూడకపోతే వుండలేని స్థితి ఎప్పుడూ రాలేదు. ఆమె సమక్షంలో పారవశ్యం, ఆమెని చూసినా, తాకినా తనలో ఏ వికారము, ఏ అలజడి కలగలేదు ఎప్పుడూ. తన మగ ఫ్రెండ్స్‌తో సినిమాకి వెడితే వాళ్ళ కంపెనీ ఎలా ఎంజాయ్ చేస్తాడో అలాగే అన్పించేది తార కంపెనీకూడా. ఎటొచ్చీ యీమె ప్రఖ్యాత నటీమణి కనక అలాంటి ఆమె ప్రక్కన తనుండడం తనకి ఏదో ప్రత్యేకతని ఆపాదించినట్టు భావించడం మినహా మరే భావం కలగలేదు.

తామిద్దరూ ఏకాంతంగా ఎన్నిసార్లు గడిపారు. తను కావాలంటే ఎన్నో అవకాశాలుండేవి. కాని ఎప్పుడూ ఆ భావన తన మనసులో చొరబడలేదంటే ఇంక ప్రేమకి తావెక్కడుంది? ప్రేమ అటుంచి కనీసం స్త్రీ పురుషాకర్షణకి కూడా తను లోనుగాలేదంటే తారపట్ల తనకేభావం లేదన్న సంగతి స్పష్టపడడంలేదూ? మరి తారతో తనెందుకు తిరుగుతున్నాడు?

ముందులో పాత పరిచయం, ఆ తరువాత ఆమెమీద జాలి, సానుభూతి, ఆ తరువాత కలసి తిరిగితే ఏర్పడే

ఎటాచ్ మెంట్... ఆమె తనకి కాలక్షేపం ఇచ్చే మంచి స్నేహితురాలుగా మాత్రం కనిపిస్తుంది. అంతే... అసలు యీనాడు వట్టి సుందరే మళ్లీ కనిపిస్తే... ఒకసారి పలకరించడం మినహా తను ఆమెతో ఏవిధమైన సంబంధం పెట్టుకునేవాడా? యిలా తిరిగేవాడా! ఉహూ అంటే.: అంటే, కేవలం తార 'సినీతార' కనక తను ఎట్రాక్ట్ అయ్యాడన్న మాటేగదా! ఆమెకి డబ్బుంది కనుక, ఆమె తనని హాయిగా త్రిప్పుతూంది గనక తను ఆమెదగ్గరికి వెడుతున్నాడుగాని, తార కనక ఉత్తి సుందరే అయితే తను యిన్నిసార్లు కలుసుకునేవాడు కానేకాదు! అంటే వ్యక్తిగా ఆమెపట్ల తనకేంలేదు. ఆమె గ్లామర్, డబ్బుకి మాత్రం ఆకర్షితుడయినట్టేగదా -

ఓరోజు సావకాశంగా కూర్చుని ఆత్మవిమర్శ చేసుకొన్నాక, తార అంటే తన మనసులో ఏముందో స్పష్టపడ్డాక, యింకా యింకా తార ఇంటికి వెళ్ళడం, ఆమెతో తిరగడం, ఆమెకి లేనిపోని ఆశలని కల్పించినట్టవుతుందనే నిర్ణయానికి వచ్చాడు. ఇంక వెళ్ళకూడదన్న నిర్ణయానికి వచ్చాడు. ఆమెతో యీ తిరుగుడు తన భవిష్యత్తుకే నష్టమవవచ్చు. తార కోరితే ఆమెని తను పెళ్ళిచేసుకోగలడా! ఆమెకి అందంలేదు. కేవలం అందమేకాదు, చూడ్డానికి వికారంగా కూడా వుంటుంది! కేవలం బాహ్యసౌందర్యాన్ని కోరకపోయినా బొత్తిగా చూస్తూచూస్తూ తారలాంటి దాన్ని వివాహం ఆడగలడా! పెళ్ళిచేసుకుంటే ఆమె అన్నట్టు ఆమె సంపాదన, గ్లామర్, డబ్బు చూసి చేసు

కోవాలి తప్పు ఏమీ లేదు. కేవలం ఆమెని ఆమెగా మాత్రం వివాహం ఆడలేడన్నది నిశ్చయం! అలాంటప్పుడు మనసు లేని యీ పెండ్లి చేసుకోడం ఆమెకి అన్యాయం చేయడమే గాక తనకి తాను చేసుకోడం అవుతుంది! పెళ్ళి చేసుకొని తార అన్నట్టు ఆ యింట్లో మనుష్యులతోపాటు జమ అయి ఆమె సంపాదనకోసం లేని ప్రేమ నటించడం ఆమెపట్ల అన్యాయమే అవుతుంది. సారథి చాలా గట్టిగా తారతోటి పరిచయం ఇంకా ఇంకా పెరగనీయకూడదన్న నిర్ణయానికి వచ్చాడు.

కాని తార-సారథి యీ నిర్ణయాలని నిలవనీయ లేదు. ఒక్క పదిహేను రోజులు ఫోను చెయ్యలేదు. ఒక్క నెల రోజులు ఆమె దగ్గరికి వెళ్ళకుండా తప్పించుకోగలిగాడు. ఒక రోజు తార ఫోను చేసింది ఎందుకు రావడం లేదంటూ.

"పని వుంటుంది తారా..." నిష్కర్షగా చెప్పలేక అబద్ధం ఆడాడు.

"అబద్ధం ఆడకు సారథీ... ఇన్నాళ్ళు లేనిపని ఇప్పు డెక్కడనించి వచ్చింది. రెండురోజులుగాని నెలరోజులూ పని వుంటుందా? చెప్పు—నిజం చెప్పు—పరవాలేదు."

"క్షమించు సుందరీ...రాలేను..."

"అదే, ఎందుకు, ఏం జరిగింది? నావల్లేమయినా పొరపాటు జరిగిందా?" ఆదుర్దా ధ్వనించింది ఆమె గొంతులో.

"అబ్బె.. అదేం కాదు... సారీ, కారణం అడగకు... మనిద్దరి యీ పరిచయం ఇంక పెరగడం మంచిది కాదని నా ఉద్దేశం..."

"అంటే...అంటే... పత్రికల్లో ఏదో రాశారని బాధ పడుతున్నావా? అలాంటి రాతలకి భయపడి మనస్నేహం దూరంచేసుకునేటంతటి పిరికివాడివా?" తార గొంతు తీవ్రంగా వుంది.

"కాదు...అదికాదు...నీకర్థంగాదు, ఎలా చెప్పాలో నాకు తెలియదు, ఈ నిర్ణయం వల్ల ఇద్దరికీ మేలేజరుగుతుందని నా నమ్మకం. క్షమించు సుందరీ."

"సారథీ, ముందునించీ చూస్తున్నాను నీ వరస. నీ వేదో చాలా గొప్పవాడివనుకుంటున్నావు..నేనేదో నీవెనక బడినట్లు టెక్కు-చేస్తున్నావు... నాక్కా-వాలంటే నీలాంటి వాళ్ళని లక్షమందిని కాళ్ళదగ్గరకి పడేసుకోగలనన్న సంగతి మరిచిపోకు... ఏదో పాత పరిచయంకొద్దీ పలకరించాను... అభిమానించాను... కాని... నీవెలాంటివాడివో యిప్పుడు తెలుసుకొన్నాను... ఐ బిగిన్ టు హేట్ యూ లైక్ ఎనీ థింగ్... గుడ్ బై..." తార గొంతు కోపంగా తారస్థాయి నందింది. ఫోను ఠక్కు-న పెట్టేసింది.

తారకి కోపం వచ్చింది. పోనీ యిదీ మంచిదే, కోపంతోనైనా తనని కలుసుకోడం మానేస్తుంది. కొన్నాళ్లలో తనని పూర్తిగా మరిచిపోతుంది...తనూ, ఏదో తనకి నచ్చిన అమ్మాయిని చేసుకుంటాడు. తారని డబ్బుకోసం చేసుకున్నా ఆ డబ్బుతో, భార్య ఆర్జించే డబ్బుతో తను సుఖపడగలడా? ఏ గంజి నీళ్ళయినా తను సంపాదించాలి. భార్య బిడ్డల్ని పోషించాలి అన్న అహం ప్రతి మగాడికీ వుంటుంది తనకీ

వుంది! ఓ తారకి భర్తగా అనామకుడిగా బ్రతకలేడు తను! తార ఇంక తనజోలికి రాదు బహుశ-అదే కావాలి తనకి!

కాని సారథి అంచనాలు రెండోసారీ తప్పాయి.

పదిరోజుల తర్వాత...

రాత్రి తొమ్మిదిగంటలకి-హోటల్లో భోంచేసివచ్చి ప్రక్కమీద పడుకుని ఏదో ఇంగ్లీషునవల చదువుతున్నాడు సారథి.

తెరిచివుంచిన తలుపులోంచి సుడిగాలిలా లోపలికి వచ్చింది తార. తెల్లపోయిచూస్తూ సారథి ప్రక్కమీదనించి లేచేలోపలే అతని గుండెలమీద వ్రాలిపోయి అతని గుండెల్లో మొహం దాచుకు వెక్కివెక్కి ఏడవటం ఆరంభించింది. సారథి విస్తుపోతూ కొన్నిక్షణాలు అలానిశ్చేష్టుడై వుండిపోయాడు. తరువాత "తారా !...ఏమిటి ? ఏమిటిది, ఏం జరిగింది ?" అంటూ ఆమెని లేవనెత్తి తను లేవడానికి ప్రయత్నించాడు. కాని తార అతనిని ఇంకా హత్తుకుపోయింది. అతని గుండెల్లో మరింతగా వదిగిపోయింది. అతని చుట్టూ చేతులు ఇంకా బిగించింది. "సారథీ...సారథీ, నీవు లేకుండా బ్రతకలేను. నన్ను దూరం చేయకు. నీవుదూరమైతే బ్రతకలేకపోతున్నాను సారథీ" అంటూ ఏడవసాగింది.

సారథి ఇంకా ఆశ్చర్యంనించి తేరుకోలేకపోయాడు. తార ఎందుకు ఏడుస్తూందో, ఏమంటుందో అర్థంచేసికోలేకపోయాడు. "తారా, ఏమిటిది. ప్లీజ్, లేవనీ నన్ను, లేచి కూర్చో, ఎవరైనా చూస్తేబాగుండదు, లే లేచి కూర్చో"

"ఊహూ, లేవను. ముందు మాట ఇయ్యి. నన్ను దూరం చెయ్యనని, నాకు దూరం అవనని మాట ఇయ్యి." ఇంకా ఏడుస్తూనే అంది "నీవు కావాలి సారథీ. నీవు కావాలి నాకు."

సారథి కాస్త బలంగానే తారని లేవదీసి లేచి ప్రక్కమీద కూర్చున్నాడు. ఏడుస్తున్న తార మొహంలోకి వింతగా చూసి, "ఏం జరిగింది సుందరీ యీ ఏడుపేమిటి? ఇలా వచ్చేవేమిటిరాత్రి? ప్రశ్నలుకురిపించాడుఆరాటంగా."

తార అతనికి మొహం చూపించలేనట్టు రెండు చేతులతో మొహం దాచుకుంది ఏడవడం తప్ప ఏం సమాధానం చెప్పలేదు. "సుందరీ, ఛ, ఏమిటీ ఏడ్పు ముందు కళ్ళు తుడుచుకో. ఊ" అనునయంగా అంటూ ఆమె చేతులని మొఖంమీదనుంచి తొలగించాడు. తార మొఖమంతా కన్నీటి చారలతో తడిసింది. మూసుకున్న ఆమె కళ్ళనుంచి చెంపలంబడి నీరు జారుతోంది. సారథి మనసు ద్రవించింది తారనా స్థితిలో చూసి.

"సుందరీ ఏమిటిది. ఈ ఏడ్పేమిటి చెప్పు. ఏం జరిగిందో చెప్పు. ఇంట్లో ఎవరైనా ఏమన్నా అన్నారా?" ఆమె భుజంమీద చెయ్యివేసి ఆదరంగా అడిగాడు. ఆమె కళ్ళు తెరవకుండానే తలాడించింది అడ్డంగా.

"ఎవరూ ఏమీ అనలేదు. ఎవరూ ఏమీ చెయ్యలేదు. నీవే, నీవే చేశావు అంతా, నీవే నన్నిలా ఏడిపిస్తున్నావు" విసురుగా అని మళ్ళీ మొహం చేతులతో కప్పకుని ఏడుపు ఆరంభించింది. సారథి ఏంచెయ్యాలో తోచక కొన్ని

క్షణాలు అలా నిశ్శబ్దంగా ఆమె ఏడుపుని చూస్తూ ఊరుకున్నాడు. కొంతసేపటికి ఆమె ఏడ్పు ఉధృతం తగ్గింది. మొహంమీాదనుంచి చేతులు తీసింది. కళ్ళు తెరచి తననే చూస్తూన్న సారథివంక చూడకుండానే పమిటతో కళ్ళు, మొహం తుడుచుకుంది.

"సారీ, నిన్ను డిస్టర్బ్ చేసినట్టున్నాను. క్షమించు." అంటూ ప్రక్కమీాదనుంచి దిగి లేచినిల్చొంది. "సిల్లీగా బిహేవ్ చేశాను ఏమనుకోకు" అంది అదోలా.

"అసలిదంతా ఏమిటి సుందరీ... నాకేం అర్థం కావడంలేదు." విస్మయంగా అడిగాడు. తార కఠినంగా నవ్వింది. "అవును నీలాంటి కఠినులకి, హృదయంలేని మనుషులకి అర్థంకాదని నాకు తెలుసు అందుకే, ఇది తెచ్చాను. అప్పటికైనా అర్థమవుతుందేమో చూడు. అర్థమైతే జవాబు రాయి." అంటూ హేండ్ బ్యాగునుంచి ఓ కవరుతీసి సారథి చేతిలో పెట్టి గబగబ బయటికి వెళ్ళిపోయింది. సారథి తేరుకుని "సుందరీ" అంటూ గుమ్మం దగ్గరికి వెళ్ళేసరికే ఆమె కారు కదిలింది.

ఆరాటంగా సారథి చేతిలో కవరు చించాడు.

"సారథీ... నా సారథీ

నీవులేక నేను బ్రతకలేనని ఈ నెల రోజులు స్పష్టం చేశాయి. నా మనసేమిటో, నేనేమిటో అప్పుడు గ్రహించలేకపోయినా మనం కలిసి తిరిగిన ఇన్ని రోజుల్లో నీవు గ్రహించలేకపోతే ఇంకేం చెప్పగలను? చెప్పకపోతే తెలియనట్లే నటించే నీ గడుసుతనాన్ని నీ పురుషాహంకారాన్ని

క్షమించలేక పోతున్నాను. కేవలం ఆ నటనకి అహంకారం ఒక్కటే కారణం అయితే నీవే గెలిచావు. ఈ వుత్తరం నేనే రాశాను కనక, ఇంక అహంకారానికి అర్థంలేదు. అలాకాక ఇదివరకు సుందరిగా అడిగినపుడు ఏం జవాబిచ్చావో యిప్పుడు అదే జవాబు మరోసారి యిస్తే?! యిస్తే... నేనేం అవుతానో ఎలా చెప్పను ? యింతకంటె ఏం రాయను ! నీ జవాబు మీద నా భవిష్యత్ ఆధారపడివుంది ! ఎదురు చూస్తుంటాను- నన్నీ నరకంనుంచి తప్పిస్తావన్న ఆశతో- నీ జవాబుకి— నీ సుందరి.

వుత్తరం చదివి ఏదో పెద్ద ఆపద నెత్తినపడినవాడిలా సారధి దిగాలుపడి అలా కూర్చుండి పోయాడు. ఉత్తరం చిన్నదే ! భావం పెదది ! ఏం జవాబు రాయటం ! ఇలాంటి దేదో తప్పదని ఎదురుచూసినక్షణం రానేవచ్చింది. సుందరి, పాపం సుందరి ! తనేం చెయ్యాలి ? ఏమని జవాబివ్వాలి ?

ఆరాత్రి ఒక్క క్షణం నిద్ర పట్టలేదుసారధికి. ఎంత ఆలోచించినా తారకేం జవాబివ్వాలో అంతుపట్టలేదు. అతని ఆలోచనలు, అతని మనసూ, అవును, కాదు మధ్య ఉయ్యాలలూగాయి.

హాయిగా బోలెడు డబ్బు ఈ జీతంతో తనెన్ని జన్మలు ఉద్యోగం చేసినా సంపాదించలేని డబ్బు. డబ్బుతో తను ఈజన్మలో పొందలేని సుఖాలు, వాటిమధ్య తను. తార ఇంట్లో బంధువులందరితోపాటు తనూ ఒకడు—తార సంపాదన మీదే దృష్టి—అనామకుడిగా, నటీమణి భర్తగా ఆమె వెనక తిరిగే తనని అందరూ చూసి చాటుగా హేళనగా

నవ్వడం- డబ్బుకోసం తనూ వారిని పీడించడం- తారకి, తనకి డబ్బువల్ల మనస్పర్థలు- తార తనని హేళనగా చూడటం— ఇంట్లో వాళ్ళందరితోపాటు తననీ ఏహ్యించుకోవడం, తనూ డబ్బుకు దాసోహం అయిపోవడం- డబ్బుకోసం తార అడుగులకి మడుగులు వత్తటం.

తార గదినుంచి ఎవరో ప్రొడ్యూసర్లు, నటులు... రావడం. తను చూసినపుడు ఎర్రపడ్డ తార మొఖం- ఆ ఎర్రదనం తను అలా చూడడంవల్ల వచ్చిందో, నిజంగా తప్పు చేసినందువల్ల వచ్చిందో అప్పుడు గ్రహించలేని తను, పెళ్ళయ్యాక అవన్నీ చూస్తూ తప్పుకుని ఏం తెలీనట్టు వెళ్ళిపోయే తను... రెండు మూడు సారులు ఆమె మాటల తడబాటు, ఆ నిషా అన్నీ స్వయంగా చూసిన దృశ్యాలు.

పత్రికలలో నటీమణుల గురించి రాసే వార్తలు నిజాలా అబద్ధాలా- నిజం కాకపోవడం ఏమిటీ- తార పుట్టింరోజు అందరూ, తారని బుజాలచుట్టూ చేతులువేసుకు కౌగిలించుకోడం, బుగ్గల మీద ముద్దులు పెట్టుకోడం- ఏదీ మామూలు ఆడదానిమీద అలా చేతులు వేస్తారా ?

తార ఫోనులో మాటలు, ఒకసారి హీరో శ్యామ్ తార స్టూడియోలో ఆడుకునే హాస్యాలు, మాటలు. మరోసారి స్టూడియోలో తార వినడంలేదని ప్రొడ్యూసరు మేకప్ మేన్‌తో “హీరోయిన్‌గారికి ... కట్టవయ్యా” అన్న మోటు మాటలు, షూటింగులో ఒక్కొక్కరోసారి వచ్చి మొహం, బుజాలుఅటుఇటుతిప్పడం, చీరకొంగులు సర్దడం- ఇవన్నీ హీరో

యిన్ మొగుళ్ళు భరించాల్సిందేనా ? సుందరి తార గావ డానికి ముందు తనకి తెలియని నిజాలు ఇంకా ఏమున్నాయో! ఆ ఎక్స్ట్రా సప్లయర్ సుందరిని పూరికే అన్నాళ్లూ వుంచు కున్నాడా ఇంట్లో ? సుందరిని ఆ మొదటి ప్రొడ్యూసర్లు డైరెక్టర్లు వూరికేనే సినిమాలో ఛాన్సు ఇచ్చేసారా ?- సినీ నటి గావాలంటే - అందరూ అనుకునేవన్నీ త్యాగాలు చేయాలా ? ఈ మాటల్లో నిజంవుందా ? వుంటే తనకెందుకు లేకపోతే తనకెందుకు.

—లక్ష అనుమానాలు, లక్ష దృశ్యాలు కళ్ళముందు కదిలి పోయాయి రాత్రంతా. ఓసారి "అయ్యో పాపం తార తనని నిజంగా ప్రేమించింది. తార అమాయకురాలు. ఆ ఇంట్లో సుఖం, శాంతి లేదు ఆమెకి ! తనని డబ్బుకోసం కాక తనని తనుగా ప్రేమించే మనిషిని కోరుకుంటుంది. ఆ మనిషి తనవ్వాలని ఆమె ఆశ ! ఆమె ఆశలని కలలని నిర్దా క్షిణ్యంగా చీల్చెయ్యడమేనా !

భవిష్యత్తు మీాద ఎన్ని ఆశలు పెట్టుకుని, సిగ్గు, బిడియం అన్నీ విడిచి తన దగ్గరకొచ్చి కన్నీళ్ళతో బ్రతిమి లాడింది- నీవు లేకుండా బ్రతకలేనంది. ఇంతలా ప్రేమించే స్త్రీకి అందచందాలు వుండాలా ? మనసుంటే చాలదా ! ముందే జీవితం గడిపిందో తనకెందుకు - ఇప్పటి ఆమె ప్రేమచాలదా ! తను కోరితే నటజీవితానికి స్వస్తిచెప్పే స్తుంది. కాని ... ఓసారి డబ్బురుచి మరిగాక ఆమాటమీాద నిలకడగా వుంటుందా ! అలా అన్న ఎందరో మళ్ళీ నటిం

చడం ఆరంభించడం లేదూ! డబ్బు...డబ్బు. దానిముందు తన మాటకి విలువ ఇస్తుందా ? తనూ డబ్బుకి లొంగిపోకుండా తన జీతంతో సరిపెట్టుకోగలిగే నిబ్బరం వుందా ? — కోరి తద్దినం తెచ్చుకోడం కదూ, యీ బెడద అంతా కౌగిలించుకోడం. ఏ లేనింటిదాన్ని చేసుకుంటే తనకి ఓ భర్తగా గౌరవం లభిస్తుంది — తారని పెళ్ళాడితే తనన్నీ వదిలేసుకోవాలి — అందుకు సిద్ధపడగలిగే తారని, తార చేతలని ఆమోదించే హృదయవైశాల్యం వుందా — అసలు తార మీద తనకే ప్రేమా లేదు. మరింక దేనికోసం యీ పెళ్ళి! డబ్బుకోసమా ! ఆమెమీద జాలిపడా ! ఆమెమీద జాలితో తన జీవితం నాశనం చేసుకోవాలా! తారని పెళ్ళాడితే నాశనం అవుతుందా తన బ్రతుకు —

ఆలోచనలతో సారథి బుర్ర వేడెక్కిపోయింది. ప్రక్కమీద దొర్లి దొర్లి నిద్రపట్టక తలుపు తీసుకుని బయటికి వచ్చి వరండాలో నిల్చున్నాడు.

బయట పండువెన్నెల కురుస్తూంది చల్లగా. ఆకాశం నిండా లెక్కలేనన్ని తారలు మిణుకుమిణుకు మంటున్నాయి. అందంగా మెరుస్తున్నాయి.

అలా చూస్తుంటే ఓరోజు తార అన్నమాట గుర్తు వచ్చింది - "ఆకాశంలో మిలమిలలాడే అందమైన తారలని అక్కడికెళ్ళి చూస్తే ఏముంది గుంటలు గోతులు తప్ప- మా బ్రతుకులూ అంతే !"

ఎంత నిజం - ఆ తారలని దూరంనుంచి చూస్తేనే వాటి అందం! అవి అందుకోవాలని ప్రయత్నించనంతవరకే వాటి మిలమిల ! అందుకున్నాక ఏముంది బుగ్గి, మన్ను, గుంటలు, గతుకులు ! ఆకాశంలోని తారలని అందుకోవాలని ఆశించడం అవివేకం గదూ ! ...

అలా చాలాసేపు చూసి సారథి లోపలికి వచ్చి లైటు వేసుకుని కాగితం కలం తీసుకున్నాడు.